RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 255 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | బుధవారం 29 - 7 - 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1 - 00

## నిరసనకారులపై చర్యలు వద్దు :సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ,జూలై, 28:**పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి బలవంతపు, కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 18 ఏండ్లలోపు వారిని, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

## పీఓకేలో పాకిస్థాన్ ప్రభుత్వం దమనకాండ

**న్యూఢిల్లీ,జూలై, 28:**ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లో పాకిస్థాన్ ప్రభుత్వం దమనకాండను ప్రదర్శిస్తోంది. ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చిన స్థానికులపై ఆ దేశ ఆర్మీ బలగాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి.నిన్నటి నుండి ఎన్నికలను బహిష్కరిస్తున్న వారిలో, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) కోర్ కమిటీ సభ్యుడు, అధికార ప్రతినిధి అయిన ఉమర్ నజీర్ కాశ్మీరీ సోదరుడు ఉస్మాన్ నజీర్‌తో సహా 20 మందిని భద్రతా దళాలు హతమార్చినట్లు ఆ దేశ మీడియా వర్గాలు తెలిపాయి

# హైడ్రా రద్దే లేదు..

## కబ్జాదారులను వదిలేది లేదు

- హైడ్రా సంస్కరణపై సీఎం రేవంత్ స్పష్టత- కోర్టు ధిక్కరణ కేసులపై కీలక వ్యాఖ్యలు
- బడా బాబుల ఆక్రమణలే హైడ్రా టార్గెట్- హైకోర్టు ఆదేశాలపై ప్రభుత్వ సమీక్ష



**న్యూఢిల్లీ,జూలై, 28:** హైడ్రా వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా స్పందించారు. చెరువులు, నాలాలు, పార్కులు , ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న కబ్జాదారులు తప్పుడు పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణల్లో హైడ్రా ఒకటని, దానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నాయని స్పష్టం చేశారు. అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు రావడంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ పై ఏకంగా 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉండేవి అని, ఆనాడు దీనిపై ఎవరూ మాట్లాడలేదని గుర్తుచేశారు. కంటెంప్ట్ కేసులు పడినంత మాత్రాన అధికారులను మార్చాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. ఒక అధికారిని ఎక్కడ నియమించాలి, ఎలాంటి బాధ్యతలు అప్పగించాలనేది ప్రభుత్వ విచక్షణ అధికారమని, ఆ విచక్షణారాహిత్యాన్ని ఎవరూ గుంజుకోలేరని స్పష్టం చేశారు. తప్పుడు కేసుల విషయంలో తమకు న్యాయస్థానాలపై సంపూర్ణ విశ్వాసం ఉందని, వాటిని చట్టపరంగానే ఎదుర్కొంటామని తెలిపారు. కబ్జాకోరులు, బిఆర్ఎస్ నేతలు మాత్రమే హైడ్రాను రద్దు చేయాలని అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బతుకమ్మ కుంట లాంటి పవిత్రమైన చెరువులను సైతం గత ప్రభుత్వ నేతలు ఆక్రమించారని ఆరోపించారు. ముఖీమ్ అనే ఒక పెద్ద కబ్జాకోరు నుంచి భూములను ఖాళీ చేయించామని, హైడ్రా చర్యల వల్ల బడా బాబుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. చెరువులు, కుంటలు, నాలాలు , ప్రభుత్వ భూములను కాపాడటమే హైడ్రా పని అని, ఆ పనిని సంస్థ అత్యంత పర్ఫెక్ట్‌గా నిర్వర్తిస్తోందని ప్రశంసించారు. హైడ్రాను నిరోధించడానికి , ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి కొందరు డబ్బులు ఇచ్చి మరీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రజలు ఇలాంటి కుట్రలకు సహకరించవద్దని కోరారు. హైడ్రా కార్యాచరణ, అది నిర్వహిస్తున్న బాధ్యతల పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని పునరుద్ఘాటించారు.

## హైడ్రా సంస్కరణ కాదు..

# అరాచక సంస్థ.. కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్,జూలై, 28:**హైడ్రా వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వేదికగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి కేసులు పెట్టేది, దాడులు చేసేది తమపైనేనని మండిపడ్డారు. బండి సంజయ్ కొడుకును రేవంత్ రెడ్డి కాపాడారని, ఎవరికి ఎవరు రహస్య మిత్రులో ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. ఎంత ఒత్తిడి తెచ్చినా రేవంత్ రెడ్డితో తాము నిరంతరం తలపడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. హైడ్రా అనేది సంస్కరణ కాదని, అదొక అరాచక సంస్థ అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బిల్డర్లను బ్లాక్‌మెయిల్ చేయడానికి, ఆర్ఆర్ టాక్స్ పేరుతో డబ్బులు గుంజడానికి రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక టూల్‌లా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వసూలు చేస్తున్న ఈ డబ్బులు చివరకు బిఆర్ఎస్ , కాంగ్రెస్ ఖాతాలకే వెళ్తున్నాయని విమర్శించారు. సీఎం సోదరుడి ఇల్లు, ఇతర మంత్రుల ఇళ్లు చెరువుల్లో ఉన్నప్పటికీ వాటిని ముట్టడం లేదని, కేవలం పేదలనే హైడ్రా టార్గెట్ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అన్నదమ్ములే పెద్ద కబ్జాకోరులని, భూమిని భూహారతిగా మింగేస్తున్నారని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని, చట్టానికి ఎవరూ మినహాయింపు కాకూడదని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తెచ్చే ప్రతి స్కీమ్ వెనుక ఒక స్కామ్ ఉంటుందని, తాము అధికారంలోకి వచ్చాక హైడ్రాను బంగాళాఖాతంలో పడేస్తామని తేల్చి చెప్పారు.

## మహిళలను అవమానించిన

# ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖా?

### యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలో ప్రతిపక్షాల నిలదీత



**న్యూఢిల్లీ,జూలై, 28:**విద్యార్థులేమైనా ఉగ్రవాదులా? కేంద్ర హోం మంత్రి సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు నిలదీశాయి. "నీట్ ప్రశ్నాపత్రం లీక్, విద్యా వ్యవస్థలో వైఫల్యాలపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన దమనకాండకు సమాధానం చెప్పాలి. విద్యార్థులపై దాడి చేయాలని ఎవరు ఆదేశించారు. వారిపై టియర్ గ్యాస్ ఎందుకు ప్రయోగించారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? కేంద్ర ప్రభుత్వ వైఖరిపై యువత ఆగ్రహంతో ఉంది. దేశ యువతను చూసి కేంద్రం భయపడుతోంది" అని ప్రతిపక్ష నేతలు పేర్కొన్నారు. మంగళవారం లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లుపై చర్చ జరిగింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ ఘటనల్లో కఠిన శిక్ష అమలు చేసేందుకు పేపర్ లీకేజీ నిరోధక బిల్లులో సవరణ చేపట్టినట్టు తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఏవైనా లీకేజీ కేసుల్లో దర్యాప్తును కేవలం రెండు నెలల వ్యవధిలో పూర్తి చేయనున్నట్టు చెప్పారు. ?ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా సమస్యలపై కంటే ఇన్‌స్టా రీల్స్ పైనే దృష్టి పెడుతున్నారని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ ఎద్దేవా చేశారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటం చేస్తుంటే.. మోడీ మాత్రం రీల్స్ చేస్తూ కూర్చున్నారని ఆరోపించారు. ప్రశ్నాపత్రాల లీకేజీని అరికట్టేందుకు ప్రభుత్వం 2024లో ప్రవేశపెట్టిన చట్టం కఠినంగా ఉంటే పేపర్ లీక్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. లీకేజీ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ బిల్లుకు ప్రతిపాదించిన సవరణలను పరిశీలిస్తే.. అర్థవంతమైన మార్పును తీసుకురావాలని ప్రభుత్వం అనుకోవట్లేదనే విషయం తెలుస్తోందన్నారు. ఈ పరీక్షా సంస్కరణలు కేవలం కంటితుడుపు చర్యలేనని, గతంలో కూడా ప్రభుత్వం ఇలాంటి హామీలే ఇచ్చిందని పేర్కొన్నారు.

2024 నీట్ పేపర్ లీకేజీ జరిగినప్పుడు ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని, అప్పుడు కూడా ఎలాంటి లీకేజీ జరగలేదని కప్పిపుచ్చడానికి ఆయన ప్రయత్నించారని దుయ్యబట్టారు.

ధర్మేంద్ర ప్రధాన్‌కు బీజేపీ నేతలు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టారు. తప్పును ఎదిరించి పోరాట స్ఫూర్తిని చాటిన విద్యార్థులకు గొగోయ్ ధన్యవాదాలు తెలిపారు. నిరసనకారులపై ప్రభుత్వం అమానవీయంగా ప్రవర్తించిందని విమర్శించారు. నిరసనకారులను అలా కొట్టాలని వారిని ఎవరు ఆదేశించారని ప్రశ్నించారు.

# పోలీసు కేసులకు భయమా..?




మాస్కుల వెనుక విద్యార్థుల భవిష్యత్ ఆందోళన
పోలీసుల ఏఐ ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల భయంతో మాస్కులు ధరిస్తున్న యువత
ఎఫ్ఐఆర్‌లు నమోదైతే ఉద్యోగాలు, పాస్‌పోర్ట్‌లకు సమస్యలు వస్తాయని ఆందోళన

**న్యూఢిల్లీ,జూలై,28:**

నీట్–యూజీ పేపర్ లీక్ వ్యవహారంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కొత్త ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసు కేసులకు భయపడి చాలామంది విద్యార్థులు మాస్కులు, కళ్లద్దాలతో తమ గుర్తింపును దాచుకుంటున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల నిఘానే దీనికి ప్రధాన కారణం. నిరసనలో పాల్గొన్న తమపై ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ జారీ, విదేశీ విద్య అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. "మాడిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతున్నాం. ఇందులో తప్పేముంది? మాకు పోలీసు కేసులంటే భయం లేదు" అని రవి అనే విద్యార్థి ధైర్యంగా చెబుతున్నప్పటికీ, చాలామందిలో ఈ భయం కనిపిస్తోంది. "ఒక తప్పుడు కేసు నమోదైనా, దాని నుంచి బయటపడినా కూడా భవిష్యత్తులో ఉద్యోగ, వీసా దరఖాస్తుల్లో దాన్ని ప్రస్తావించాల్సి వస్తుంది. ఇది కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే విద్యార్థులు భయపడుతున్నారు" అని సుప్రీంకోర్టు న్యాయవాది ఒకరు 'ఇండియా టుడే డిజిటల్'తో చెప్పారు. పాస్‌పోర్ట్ చట్టం ప్రకారం, కోర్టులో క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉంటేనే పాస్‌పోర్ట్ నిరాకరించవచ్చని, కేవలం ఎఫ్ఐఆర్ ఆధారంగా కాదని పలు హైకోర్టులు తీర్పులిచ్చాయి. అయినప్పటికీ, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. నేరస్థులను గుర్తించేందుకే కెమెరాలు పెట్టామని పోలీసులు చెబుతున్నా, ఇది తమ వ్యక్తిగత స్వేచ్ఛపై దాడి అని విద్యార్థులు, మానవ హక్కుల కార్యకర్తలు వాదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, నిరసన తెలిపే హక్కుకు, భవిష్యత్తు భద్రతకు మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారు.

# భోపాల్ లో 24 గంటల్లో 10 మంది మిస్సింగ్..!

అదృశ్యమైన వారిలో ఇద్దరు మైనర్లు..?
కోలార్, అయోధ్యా నగర్‌లో ఎక్కువ కేసులు
సీసీటీవీ, మొబైల్ డేటా పరిశీలన
రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లలో గాలింపు
సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి...




భోపాల్,జూలై,28:

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 24 గంటల వ్యవధిలో 10 మంది అదృశ్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ పరిధుల్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదులు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కొందరి మొబైల్ ఫోన్లు ఇంటి నుంచి వెళ్లిన కాసేపటికే స్విచ్ ఆఫ్ కావడంతో వారి ఆచూకీ కనిపెట్టడం కష్టంగా మారింది.

కోలార్, అయోధ్యా నగర్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో అత్యధికంగా మూడు చొప్పున మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. అశోక్ గార్డెన్, టీటీ నగర్, రతీబాద్, అవధ్‌పురి పోలీస్ స్టేషన్ పరిధుల్లోనూ కేసులు నమోదయ్యాయి. అశోక్ గార్డెన్‌లో 17 ఏళ్ల విద్యార్థిని ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు స్వయంగా వెతికినా సమాచారం లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

అయోధ్యా నగర్ పరిధిలో 19 ఏళ్ల గరిమా, 24ఏళ్ల తను, 22 ఏళ్ల మనీశ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదులు అందాయి. కోలార్ పరిధిలో 20 ఏళ్ల శివకాంత్, 40 ఏళ్ల అమర్‌జీత్, 45 ఏళ్ల తులసీరామ్ కనిపించకుండా పోయారు. టీటీ నగర్‌కు చెందిన ముస్కాన్, రతీబాద్‌కు చెందిన 30 ఏళ్ల అన్మోల్ సోనీ, అవధ్‌పురి పరిధిలోని 16 ఏళ్ల బాలిక అదృశ్యమైన వారి జాబితాలో ఉన్నారు. ప్రతి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంతో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులను ప్రశ్నించడంతో పాటు సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

రైల్వే స్టేషన్లు,బస్ స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో గాలింపు కొనసాగుతోంది.మొబైల్ ఫోన్‌లొకేషన్లు, కాల్ వివరాలను సైబర్ బృందం విశ్లేషిస్తోందని అదనపు పోలీస్ కమిషనర్ శైలేంద్ర సింగ్ చౌహాన్ వెల్లడించారు. అదృశ్యమైన వారి గురించి సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రధాన్ శాఖ మార్పు ప్రతిపాదన..!

# సీజేపీ తిరస్కరించినట్లు సమాచారం..!?



రాజీనామాపైనే సీజేపీ పట్టు
రాహుల్ గాంధీ కూడా అదే డిమాండ్

**న్యూఢిల్లీ,జూలై,28:**

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం తొలుత ఆయన శాఖను మాత్రమే మార్చుతామని ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే దానికి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తిరస్కరించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచే తప్పించాలని సీజేపీ స్పష్టంచేసినట్లు తెలిసింది. సమాచారం ప్రకారం.. జులై 20న కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్,ఆశుతోష్ రాంకాతో సమావేశమయ్యారు. ఆ సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ నుంచి మరో శాఖకు మార్చే ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. అయితే కేవలం శాఖ మార్పుతో తమ ఆందోళన విరమించబోమని, ఆయన పూర్తిగామంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేసినట్లు సమాచారం. మంత్రి పదవుల కేటాయింపు, మార్పులు ప్రధానమంత్రి పరిధిలోని అంశమని కేంద్ర మంత్రులు చెప్పినట్లు తెలుస్తోంది. ఒకవేళ రాజీనామా కాకుండా మరోప్రతిపాదనకు అంగీ కరిస్తేఆందోళనకారుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందని సీజేపీ భావించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ప్రస్తావించారు.

# మేం ఎవరికి ఏం అమ్మాలో ఎవరూ చెప్పనక్కర్లేదు

### టర్కీకి ఎఫ్-35 విమానాల విక్రయంపై నెతన్యాహుకు ట్రంప్ షాక్
### టర్కీ తమకు నమ్మకమైన భాగస్వామి అన్న ట్రంప్



**న్యూఢిల్లీ,జూలై,28:**

టర్కీకి ఎఫ్–35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యక్తం చేసిన అభ్యంతరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తోసిపుచ్చారు. తాము ఎవరికి ఏ ఆయుధాలు అమ్మాలో ఎవరూ తమకు చెప్పాల్సిన అవసరం లేదని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధానితో భేటీకి ముందు రోజు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. టర్కీ ప్రెసిడెంట్ రెజెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌ను తన మంచి మిత్రుడిగా అభివర్ణించిన ట్రంప్... టర్కీ తమకు అత్యంత విలువైన, నమ్మకమైన భాగస్వామి అని కొనియాడారు. అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, టర్కీ తీవ్రవాద భావజాలంతో కూడిన పాలనలో ఉందని, అలాంటి దేశానికి ఎఫ్–35 యుద్ధ విమానాలను విక్రయిస్తే పశ్చిమాసియాలో సైనిక సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# అర్హులైన ధూంధాం కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

### - ఘనంగా తెలంగాణ ధూంధాం కళాకారుల బోనాల జాతర
### కళాకారుల ఐక్యతను చాటేందుకు రాష్ట్రంలో మొదటి సారి బోనాలు



**ప్రజా గళం నిజామాబాద్ ప్రతినిధి:** తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల బోనాల జాతర ఘనంగా నిర్వహించామని జిల్లా అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్ అన్నారు.తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల వేదిక ఆధ్వర్యంలో బోనాల జాతర కార్యక్రమాన్ని ఐక్యత కోసమే జరిపామన్నారు. మంగళవారం మాక్లూర్ మండలంలోని ఓట్యాట్ పల్లి లో ఒడ్డేటవ్వ వద్ద బోనాలు సమర్పించారు. ముందుగా గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి కళాకారులు పూల మాల వేశారు. కామన్ నుంచి డప్పు దరువులతో శివ సత్తుల, పోతరాజు నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం వేదిక ఏర్పాటు చేసి కళాకారులు తెలంగాణ ఉద్యమ ఉద్యమ పాటలు అలరించాయి. ఈ సందర్భంగా అద్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అష్ట గంగాధర్, కోశాధికారి రాంపూర్ సాయి లు మాట్లాడుతూ.. జిల్లా కళాకారుల ఐక్యత చాటేందుకు అమ్మ వారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమం కోసం కష్టపడిన అర్హులైన అన్ని విభాగాల్లో ఉన్న కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని నియోజకవర్గాలలో జిల్లా ధూంధాం కళాకారుల ఆధ్వర్యంలో త్వరలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉపాధ్యక్షురాలు రేలారే రేలా గంగా మాట్లాడుతూ కళాకారులకు మంచి జరగాలని అమ్మ ఆశీర్వాదం కోసం బోనం సమర్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి కార్యక్రమం మొదటి సారి నిజామాబాద్ లో నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. అన్ని జిల్లాలు మా ఐక్యతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. తెలంగాణ వచ్చిన కళాకారుల జీవితాలు పూర్తిగా మారలేదని, ఎంతో దుర్భరంగా ఉన్నాయని గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం కళాకారుల త్యాగాన్ని గుర్తించాలన్నారు. జిల్లా లోని కళాకారులు ఒక కుటుంబంగా ఒకే దగ్గర కలవడం ఉద్యమ సమయాన్ని గుర్తు చేశాయన్నారు. ఉద్యోగాల కోసం కళాకారులు వెయ్యి కండ్లతో ఎదిరి చూస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి అందించే సహాయం తొందరగా అందించాలని కోరారు. ఈ బోనాల కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంగా, గోదావరి, సాయి లోవోల, సవిత, రాజేందర్ , సలహాదారులు పస్కా నర్సయ్య, పాశం కుమార్, బొడ్డెన్న యాదవ్, కోకిల నాగరాజు, సహాయ కార్యదర్శి కర్క రమేష్, క్రాంతి కుమార్, గోరకంటి రాజు,ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేందర్, ప్రశాంత్ రెడ్డి, మహేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు చిట్టిబాబు, మాదాసు గోపి, తోగరి నర్సయ్య, చిన్న రాజేందర్, రవి నాయక్, డప్పు సంతోష్, మనోజ,దివ్య, మానస, స్రవంతి, సమత, లత, శ్వేత జిల్లా ఉద్యమ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ రహిత భారత్ మన అందరి లక్ష్యం



**నిజామాబాద్,జూలై 28, ప్రజాగళం:** ఈ రోజు నిర్వహించిన టీబీఎంబీఏ 2.0 మెగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ డా. రాజశ్రీ మరియు డీటీసీఓ డా. దేవి నాగేశ్వరి సందర్శించారు. 28వ వార్డు కార్పొరేటర్ శ్రీ మహేందర్ నిక్షయ్ మిత్రగా సేవలందిస్తున్న నేపథ్యంలో, క్షయవ్యాధి రోగులకు అందిస్తున్న విలువైన సహకారానికి గుర్తింపుగా డీఎంహెచ్ఓ , డీటీసీఓ మరియు ఎస్ఆర్ నగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది కలిసి కార్పొరేటర్ ఘనంగా సత్కరించారు. అదేవిధంగా, ఛాతీ ఎక్స్-రే, ఇతర ఉచిత వైద్య పరీక్షలు వంటి అవసరమైన ఆరోగ్య సేవలను ప్రజలకు వారి వార్డులోనే అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజారోగ్య పరిరక్షణకు విశేషంగా కృషి చేసినందుకు కృతజ్ఞతా సూచకంగా 28వ వార్డు కార్పొరేటర్ మల్కాయి మహేందర్ నిక్షయ్ మిత్ర గా 4 ఫుడ్ కిట్స్ ఎందీ రోగులకి అందచేశారు ..ఈ క్షయ నియంత్రణ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిల్లా రామ్మోహన్ జన్మదినం సందర్భంగా జైతాపూర్ లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన సర్పంచ్....



**ఎడపల్లి,జూలై 28: (ప్రజా గళం)** బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు బిల్లా రామ్మోహన్ జన్మదిన వేడుకలు ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామంలో సర్పంచ్ నాగుల రాజు గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బిల్లా రామ్మోహన్ జన్మదినం సందర్భంగా గ్రామంలోని ప్రైమరి పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ రాజు గౌడ్ పండ్లు పంపిణి చేశారు.అంతకుముందు విద్యార్థుల చేత కేక్ కట్ చేయించి అందరికి పంపిణి చేసి రామ్మో హన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో గ్రామ ఉపసర్పంచ్ భార్గవ్,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోహన్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అఖిలేష్ గౌడ్, ఆత్మ చైర్మన్ కృష్ణా రావు, కాంగ్రెస్ పార్టి సీనియర్ నాయకులు బూరుగుపల్లి కిష్టయ్య,నాయకులు గోడితి నవీన్,ప్రైమరి స్కూల్ హెచ్ఎం బాలేష్,ఉపాధ్యాయులు ,సిబ్బంది,గ్రామ పెద్దలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి,ఆచన్ పల్లి క్లబ్ వారి సం యుక్త ఆధ్వర్యంలో మంగళ్ పాడ్ లో ఉచిత వైద్య శిబిరం....152 మందికి ఉచిత వైద్యపరీక్షలు,23 మంది కీ కంటి పరీక్షలు,ఉచిత అవురేషన్ కై బోధన్ కు రిఫర్...



**ఎడపల్లి,జూలై 28:(ప్రజా గళం)** లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి వారి సంయుక్త అద్వర్యంలో మంగళవారం ఎడపల్లి మండలం మంగళ్ పాడ్ గ్రామంలో లయన్స్ ఐ హాస్పిటల్ అలాగే లయన్స్ జనరల్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఒకే వేదిక పై గ్రామ పంచాయతి వద్ద 6 ప్రోగ్రాం లను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కంటి పరీక్ష క్యాంపు,డయాబేటిక్ క్యాంపు,బీపీ,షుగర్ టెస్ట్ క్యాంపు,ఉచిత ఇసిజి పరీక్ష, ఉచిత మందుల పంపిణి చేశారు.పెద్దఎత్తున ఈ శిబిరా నికి గ్రామస్తులు విచ్చేసి సంబందించిన వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ శిబిరంలో 152 మందికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి వారికీ ఉచితంగా మందులు పంపిణి చేసి వైద్యులు తగు జాగ్రత్తలు,సూచనలు చేశారు.ఇందులో 23 మంది కంటి పరీక్షలు చేసుకోగా వారికీ కట్రాక్టు గుర్తించి వారికీ ఉచిత శస్త్ర చికిత్స నిమి త్తం బోధన్ లయన్స్ కంటి హాస్పిటల్ కి రిఫర్ చేయడం జరిగింది అని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.అం తేకాకుండా మంగల్ పాడ్ గ్రామంలో బిల్లా రామ్మోహన్ పుట్టిన రోజు సందర్బంగా లయన్స్ క్లబ్ తరపున పండ్ల పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని తెలిపారు.ఈ సందర్బంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు బిల్లా రామ్మోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ కె.సూర్యనారాయ ణ,కో -చైర్మన్ చక్రపాణి,లయన్స్ క్లబ్ ఆఫ్ అచన్ పల్లి అధ్యక్షులు దుర్గారావు,కార్యదర్శి రమణ రెడ్డి,కోశాధి కారి కైలాష్,లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ప్రెసిడెంట్ ఎన్. రాకేష్ వర్మ,సెక్రటరీ అరుణ్ కుమార్ గౌడ్,క్లబ్ డిసి. గంగారెడ్డి,పుష్పలత,మెర్సీ,ప్రకాష్,మనోజ్ కుమార్, స్థానిక సర్పంచ్ చేపూర్ వీణా శ్రీనివాస్ గౌడ్,బిల్లా రామ్మోహన్ కుమారులు,డాక్టర్.బిల్లా మణి దీప్, యువ నాయకులు బిల్లా మణి తేజ్,డాక్టర్.అరుణ్, అజయ్,కృష్ణ,ల్యాబ్ టెక్నీషియన్ మెహ్రాజ్,వైద్య సిబ్బం ది హనుమంత్ రావు పటేల్,సీమ,సఫురా,రఫీక్,తది తరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన బీబీపేట్ రోడ్డు వంతెన

### - కొత్త బ్రిడ్జి మంజూరు చేయాలి.మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ నర్సింలు

**కామారెడ్డి,జూలై 28,ప్రజాగళం:** కామారెడ్డి జిల్లా బిబిపేట్ మండల కేంద్రంలోని ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి కొత్త బ్రిడ్జి నిర్మించండి. ముద్రాజ్ కొరివి నరసింహులు. గత వర్షాకాలంలో కూలిన వంతెన. రోడ్డుని మళ్లీ వర్షాకాలం వచ్చింది పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళలో చాలా యాక్సిడెంట్లు కూడా అవుతున్నాయి. అయినా ఎలాంటి స్పందన లేని అధికారులు నాయకులు. ప్రభుత్వాలు ప్రతి దానిని రాజకీయాలు చేయకండి. మాకు రాజకీయ నాయకులకు సంబంధం లేదు. మళ్లీ ఎన్నికలు వచ్చేంతవరకు వేచి చూడాలా ఇలాంటి ప్రభుత్వాలు ఉన్నా లేకున్నా ఒక్కటే.ప్రభుత్వాల పట్ల చాలా పెద్ద ఎత్తున వ్యతిరేకత చూపించాల్సి వస్తుంది. నాయకులు అధికారులు స్పందించరా బీబీపేట నాలుగు జిల్లాల కూడలి కామారెడ్డి సిద్దిపేట సిరిసిల్ల మెదక్ వీళ్లు అందరూ ఇదే రోడ్డుపైన ప్రయాణం చేస్తారు. అట్లాంటి రోడ్డును మీరు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బీబీపేట్ గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు కోరుకుంటున్నారు



## క్యాన్సర్‌తో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఎండల

**బాన్సువాడ, జూలై 28, ప్రజా గళం.** కిడ్నీ సంబంధిత వ్యాధితో పాటు మూత్రాశయ క్యాన్స ర్‌తో చికిత్స పొందుతున్న బాన్సువాడకు చెందిన సీనియర్ జర్నలిస్టు యండ మూరి వరప్రసాదరావును నిజామాబాద్ మాజీ ఎమ్మె ల్యే ఎండల లక్ష్మీనారాయ ణ మంగళవారం పరామ ర్శించారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వర ప్రసాదరావు నివాసానికి వెళ్లిన ఆయన ఆరోగ్య పరి స్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.ఈ సంద ర్భంగా వరప్రసాదరావుతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే, వ్యాధి గురించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గత మూడు నెలలుగా ఆస్ప త్రుల చుట్టూ తిరుగుతు న్నానని, రెండు నెలల క్రితం యశోద ఆసుపత్రిలో మూత్రాశయంలో ఉన్న ట్యూమర్‌ను శస్త్రచికిత్స ద్వారా తొలగించారని వరప్రసాదరావు వివరించారు. చికిత్స కోసం ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చయ్యాయని, ఇంకా క్యాన్సర్‌కు సంబంధించిన చికిత్స ప్రారంభం కాలేదని, మరో రెండు మూడు రోజు ల్లో వైద్యులు చికిత్స ప్రారం భిస్తామనితెలిపారనిచెప్పారు. ఎండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వ్యాధిని ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మవిశ్వాసంతో చికిత్స కొనసాగించాలని సూచించారు. అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. పరామర్శ కార్యక్ర మంలో స్థానిక బీజేపీ నాయకులు కోణాల గంగారెడ్డి, తృప్తి శివప్రసాద్ , మోహన్ రెడ్డి, రాజిరెడ్డి, నాగరాజు, సాయిలు, సంతోష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- **సాంకేతిక సమస్యల అధిగమించి నిర్మాణాలు పూర్తి చేయాలి**
- **పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి**
- **రెండో విడత నిర్మాణాలకు పక్కా ప్రణాళిక రూపొందించండి**
- **సమీక్షా సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**నిఘానేత్రం/భద్రాద్రి కొత్తగూడెం :** మొదటి విడత కింద ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తగూడెంలోని క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్ కార్పొరేషన్, మండల ప్రజాపరిషత్ అధికారులతో ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి సొంతింటి కల నెరవేరేలా యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా రాబోయే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగానే పక్కా ప్రణాళికలతో సంసిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. ప్రజాధనం వృథా కాకుండా, నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ పేదలకు నాణ్యమైన ఇళ్లను అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారించి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, చుంచుపల్లి ఎంపిడివో సుభాషిణి, లక్ష్మీదేవిపల్లి ఎంపిడివో సుస్మిత, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## ఇందూరు కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

### - సీడీఎంఏ శ్రీదేవిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

**నిజామాబాద్,జూలై 28,ప్రజాగళం:ఇందూరు:** నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్ లోని కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందూరు అభివృద్ధి కొరకు నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేషన్ కు రావాల్సిన జనరల్ ఫండ్, ఇతర పనులను మంజూరు చేయాలన్నారు.



## బాధిత కుటుంబాలకు ప్రాజజ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఓదార్పు: బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడించిన ణజజ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ

**నిజామాబాద్,జూలై 28,ప్రజాగళం:** నిజామాబాద్ డిసిసి కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ నిన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (ూ=ూ్రా) బ్యాక్ వాటర్ ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించిన షేక్ ఖలీమ్, అజీమ్, నజువత్ ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి నివాసాలకు వెళ్ళి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ గాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాద వివరాలను ప్రాజజ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ ద్వారా తెలియజేశారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ ఫోన్లో బాధిత కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పారు. “కాంగ్రెస్ పార్టీ మరియు ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుంది, కుటుంబాలకు తగిన న్యాయం జరిగేలా చూస్తాం” అని ఆయన హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రీతం, ముస్తఫా, వహీద్, హర్షద్, గోవర్ధన్, షమీ, అయుబ్, షోయబ్, జఫర్, షకీల్, అఫ్వాన్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్ ధర్మపురి

### - నిజామాబాద్ పార్లమెంట్ పరిధి రైల్వే ప్రాజెక్టులపై వినతి

నిజామాబాద్,జూలై 28,ప్రజాగళం:నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ అర్వింద్ ధర్మపురి ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నవీపేట రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి (=ూదీ) మంజూరు చేయాలని, అలాగే డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (=ఖదీ) నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గడంతో పాటు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నివారించబడి ప్రయాణ భద్రత మరింత మెరుగుపడుతుందని ఎంపీ వివరించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ఇటీవల ఇందల్వాయి మరియు జానకంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (=ూదీం) మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ గారికి ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత మరియు రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు.



# సంపాదకీయం

## మరో యుద్ధం తప్పదా..?

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. వెనెజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో రగిలిపోతున్న ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నా డు. ఇప్పటికే ఇరాన్‌కు పలుమార్లు వార్నింగ్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వారికు రెడీ అవుతున్నాడు. ఆయుధాలు మోహరిస్తున్నాడు. ఇప్పటికే పాకిస్తాన్ బలగాలను ఇరాక్ సరిహద్దుకు తరలించాడు. అమెరికా యుద్ధ విమానాలను రెడీ చేశాడు. తాజాగా అమెరికాకు చెందిన అబ్రహం లింకన్ వాహక నౌక ఇటీవల ఇక్కడికి చేరింది. దీంతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మర్ఫీ కూడా ఇరాన్‌కు తరలించాడు. పశ్చిమాసియాలో మొన్నటిదాకా ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య దాడులు కొనసాగేవి. ఈ రెండు దేశాల మధ్యలోకి ఇరాక్, సిరియా కూడా వచ్చాయి. దీంతో దాడులు మరింత పెరిగిపోయాయి. ఇప్పుడు అక్కడ పరిస్థితులు నెమ్మదిగా మారిపోతున్న వేళ.. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం ఏర్పడిందిఅమెరికాకు చెందిన యుద్ధ విమాన వాహన నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా కు చేరుకోవడం కలకలాన్ని కలిగిస్తోంది. దీంతో ఇరాన్ పై అమెరికా దాడులు చేసే అవకాశం ఉందని ప్రచారం మొదలైంది.అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌక మాత్రమే కాకుండా, యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మర్ఫీ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ సరిహద్దుల్లోకి వెళ్లినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ యుద్ధ విమాన వాహక నౌకలు అక్కడికి వచ్చాయని తెలిపింది.ఈ విమానాలు ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో ల్యాండ్ అవ్వలేదు. హిందూ సముద్రంలో అవి దిగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది మాత్రమే కాకుండా యుద్ధ విమానాలను, కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కొంతకాలంగా ఇరాన్ దేశంలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఘర్షణలో జరుగుతున్న నేపథ్యంలో వేలాదిమంది ఇప్పటికే చనిపోయారు. అక్కడి ఆందోళనలకు ట్రంప్ బాసటగా నిలిచారు. ఒకవేళ అక్కడి ప్రభుత్వం ఆందోళనకారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే మాత్రం తాము రంగంలోకి దిగుతామని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత అమెరికా సైన్యం భారీగా ఇరాన్ దిశగా వెళ్లడం రకరకాల సంకేతాలు ఇస్తుంది. ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణంలోనే ఇరాన్ మీద అమెరికా దాడి చేసే అవకాశాలు తెలుస్తోంది. మరోవైపు అమెరికాతో ఇరాన్ చర్చలు జరిపే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చర్చలు ముందుకు సాగితే పరిణామాలు వేగంగా మారిపోతాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు.యూఎస్ సెంట్రల్ కమాండ్ దీనిని నిర్ధారించింది. ప్రాంత స్థిరత్వం, భద్రతా కారణాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. ఈ నౌకల బృందం అరబియా సముద్రం సరిహద్దుల్లో మాత్రమే కాక, హిందూ మహాసముద్రంలో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఫలితంగా, ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.పెంటగాన్ ఇంకా ఎక్కువ ఫైటర్ జెట్లు, సైనిక కార్గో విమానాలను ఈ దిశలోకి తరలించే యోచనలో ఉంది. ఇరాన్‌లో పొలిటికల్ అస్థిరతలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో వేల మంది మరణించినట్లు అంచనా. ఆందోళనలకు మద్దతుగా నిలబడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వం ఏమైనా కఠిన చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. దీని ఫలితంగా భారీ సైనిక బలగాలను రెడీ చేస్తున్నామని ప్రకటించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తలను మరింత పెంచింది.ఒకవైపు యుద్ధ విమానాలు, నౌకలను మోహరిస్తున్న అమెరికా.. మరోవైపు ఇరాన్ చర్చలకు ముందుకు వస్తే తాము సిద్ధమని అమెరికా అధికారి తెలిపారు. వెనెజువెలాపై సైలెంట్ ఆపరేషన్ సక్సెస్ అయిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నారు. ఖమేనీ ప్రభుత్వాని మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు, ఈమేరకు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నాడు. దీంతో నిరసనకారులు కూడా అమెరికావైపు ఆశగా చూస్తున్నారు. గతంలో ఒకసారి దాడి చేసిన అమెరికా ఈసారి పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతోంది.అమెరికా అబ్రహం లింకన్ యుద్ధ నౌకను ఇరాన్ దిశగా పంపుతోంది. శుక్రవారానికి సిద్ధంగా ఉండాలని ఇరాన్ నౌకలను అడ్డుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇజ్రాయెల్ దళాలు కూడా అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో అమెరికా ఇరాన్ డోమ్ యాక్టివేట్ చేసి, ఎయిర్ స్ట్రైక్‌కు సిద్ధపడు తోంది. అమెరికాతో కలిసి దాడికి ఇజ్రాయెల్ కూడా రెడీ అయింది.భూమిపై నుంచి దాడులు చేయకుండా ఎయిర్ స్ట్రైక్లు చేయాలని అమెరికా భావిస్తోంది. భూతల దాడులు చేస్తే ఐఆర్‌జీసీ అడ్డుకుంటుంది. అమెరికా సైనికులను చంపే ప్రమాదం ఉంది. అందుకే అమెరికా ఐఆర్‌జీసీని తీవ్రవాద సంస్థగా ప్రకటించింది. ప్రపంచ దేశాలతోనూ ప్రకటింపజేసి ఇరాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది.తాజా పరిణామాల నేపథ్యంలో చైనా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌పై యుద్ధం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించింది. పాలస్తీన, గత ఇరాన్ దాడుల సమయంలో ఇలాంటి స్టేట్‌మెంట్లు జారీ చేసింది. అయినప్పటికీ, ఇరాన్‌కు సరైన మద్దతు ఇవ్వకుండా బెదిరింపులకు మాత్రమే దిగుతోంది.ఈ టెన్షన్ చమురు ధరలు, గ్లోబల్ ట్రేడ్‌ను ప్రభావితం చేస్తాయి. చైనా హెచ్చరిక అమెరికా వ్యూహాలను ప్రశ్నిస్తూ, మధ్యప్రాచ్య స్థిరత్వానికి సవాల్‌గా మారింది.

**పబ్లిషర్ : కొక్కు రవికుమార్**

# ఆత్మవిశ్వాసమే ఆలంబనగా







ఆమెకుచిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. అందులోనూ రన్నిం గ్, జాగింగ్, షటిల్, బ్యాడ్మింటెన్, ఖోఖో వంటి ఆటలను అవ లీలగా ఆడేస్తుంటారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో అనేక పతకాలను కైవసం చేసుకున్నారు. ఓ వైపు చదువు, మరోవైపు క్రీడల్లోనూ రాణిస్తూ రెండు వైపులా రాటుదేలారు. చిన్నప్పటి నుంచే ఆమెకు పర్వతప్రాం తాల్లో పర్యటించటం ఎంతో ఇష్టం. అధిరోహించిన వారి వివరాలు తెలుసుకు ంటూ ఉండేవారు. తను కూడా వారి మాదిరిగానే తయారు కావాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే మనదేశం లోని అనేక పర్వతాలను అధిరోహించారు. తాజాగా దక్షిణ అమెరికా లోనిఅ త్యంత ఎత్తయిన పర్వతం మోంట్ ఏకాంకాగ్వా (6962 మీటర్లను) ఆమె అధిరోహించి రికార్డు నెలకొల్పారు. ఆమె రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఎస్.భరణి సివిల్ సర్వీసెస్ ద్వారా ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. పోస్టింగ్ రీత్యా ఆంధ్రప్రదేశ్‌కు ఐఎఫ్ఎస్ అధికారిణి హోదాలో శాప్ ఎండిగానూ, వైస్‌చైర్మన్‌గానూ, ఎపి యూత్ సర్వీసెస్ కమిషనర్, ఎపి సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లారుమెంట్ ప్రమోషన్ (స్టెప్) ఎండిగా కూడా ఆమెబాధ్యతలు నిర్వహిస్తున్నారు. మోంట్ ఏకాంకాగ్వా శిఖరాన్ని అధిరో హించిన అధికారిణిగా ఆమె నిలిచారు. 2026, జనవరి 8న దక్షిణ అమెరికా అర్జెంటైనాలో ఉన్న మోంట్ ఏకాంకాగ్వా పర్వత శిఖరాన్ని అధిరోహించటానికి ఆమె బయలుదేరి వెళ్లారు. 19రోజుల్లో ఈ శిఖరాన్ని అధిరోహించాలనే లక్ష్యాన్ని పెట్టుకోగా ఈనెల 20నే అంటే లక్ష్యానికి ఆరురోజులకు ముందుగానే ఆమె పర్వతారోహణ పూర్తిచేసేశారు. తీవ్రమైన మంచు, మంచుగడ్డలు విరిగిపడతాయనే హెచ్చరికల నడుమ, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఆమె లక్ష్యాన్ని సాధించేం దుకు ముందుకు సాగారు. ఈ ప్రయాణంలో కొన్నిసార్లు పడటం, కొన్నిదెబ్బలు తగలటం, నొప్పులతో ఇబ్బందులు పడిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. తన ముందున్న లక్ష్యాన్ని సాధించాలనే తపన ముందు అవేమీ అడ్డంకి కాలేదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగారు. అథ్లెటిక్‌గా తనకున్న ప్రావీణ్యం కూడా ఈ శిఖర అధిరోహరణకు దోహదపడింది. ఆటల పోటీల్లో చురుగ్గా: పాఠశాలస్థాయిలోనే ఆమె ఆటలంటే ఎంతో ఇష్టం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేసేవారు. పరుగుపందెం పోటీలన్నింటిలోనూ పాల్గొని తన సత్తా చాటేవారు. మిగతా ఆటల్లోనూ చురుగ్గా పాల్గొనే వారు. లాంగ్‌జంప్, హైజంప్, స్విమ్మింగ్, సైక్లింగ్, రేస్ వాకింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు బహుమతులను అందు కున్నారు. అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జా తీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలను సైతం కైవసం చేసుకున్నారు. ప్రాథమిక విద్యాభ్యాస మంతా కోయంబత్తూరులోనే సాగింది. పోస్టు గ్రాడ్యుయేషన్ తర్వాత ఆమె సివిల్స్ రాసి అందులో ర్యాంకు సాధించి ఉన్నత హోదాలో నిలిచారు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా: 'ఓడిపోతామనే భయంతో ప్రయత్నించక పోవటం కంటే..ప్రయత్నించి ఓడిపోవడమే మేలు' అన్న స్వామి వివేకానంద స్ఫూర్తిని ఆమె తీసు కున్నారు. 'అడుగేయాలి.. ముళ్లమార్గాన్ని అన్వేషిం చాలి.. అలుపొస్తున్నా కలలే కన్నా. అనుకున్నది అధిరోహించాలి' అంటూ చంద్రబోస్ రాసిన పాటే ప్రేరణగా ఆమె ముందుకు సాగుతున్నారు. పర్వతారోహణ లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు భరణి మొదట్లో భయపడ్డారు. నేను ఇది 'సాధించగలనా?' అని కొద్దిగా సంకోచించారు. ఆతర్వాత ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని ఆమె లక్ష్యసాధన కోసం అహరహం కష్టపడ్డారు. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కూడా తను ఎంచుకున్న లక్ష్యానికి అడ్డు చెప్పలేదు. ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లేవారు. సాహస కృత్యాలు చేయటం కూడా చిన్నప్పటి నుంచే ఆమెకు అలవాటు. కోవిడ్ సమయంలో ఖాళీ సమయాల్లో ఏదో ఒకటి సాధిం చాలనే కుతూహలంతో పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్నారు. కోయంబత్తూరు పరిసర ప్రాంతాల్లోని కొండలను కొన్ని సార్లు ఎక్కారు. ఆ తర్వాత హిమాలయాల్లోని కొండలను తిలకించి ఎక్కేశారు. ఆ తర్వాత కొండంత ఆత్మవిశ్వాసాన్ని ప్రోగుచేసుకుని ప్రపంచంలోనే ఎత్తయిన పర్వత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యాన్ని రూపొం దించుకున్నారు. మైనస్ 18 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకుంటూ లోయలాంటి ప్రదేశాల్లో పడిపోకుండా అత్యంత జాగ్రత్తగా అడుగులు వేయటాన్ని ప్రాక్టీస్ చేశారు. పర్వత శిఖరాలకు వెళ్లి అక్కడి చలి పరిస్థితులను తట్టుకునేలా కొన్ని రోజుల పాటు శిఖరారోహణ క్రమంలో ప్రాక్టీస్ చేశారు. అధిరోహించటానికి వెళ్లిన సందర్భాల్లో తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భమూలు అనేకం ఉన్నాయి.

# నిజాం నగలు తరలింపుపై ప్రతిష్టంబన

హైదరాబాద్,: హైదరాబాద్ రాజ్య చరిత్ర అంటేనే అంతులేని వైభవం. ఆ వైభవానికి తలమానికం 'నిజాం ఆభరణాలు'. ఈ నగలు కేవలం రాచరికపు అలంకరణలు మాత్రమే కావు, అవి దక్కన్ సంస్కృతికి, మొఘలాయిల కాలపు కళా చాతుర్యానికి, గోల్కొండ వజ్రాల స్వచ్ఛతకు నిదర్శనాలు. తాజాగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో ఈ నిధికి సంబంధించిన లోతైన విషయాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కాలంలో ఈ నగలు అత్యున్నత దశకు చేరుకున్నాయి. 1948లో హైదరాబాద్ విలీనం తర్వాత, తన వారసుల ఆర్థిక భద్రత కోసం నిజాం రెండు ప్రధాన ట్రస్టులను ఏర్పాటు చేశారు. ఒకటి 1951లో ఏర్పాటు చేసిన నిజాం జ్యువెలరీ ట్రస్ట్ కాగా రెండోది 1952లో ఏర్పాటు చేసిన నిజాం సప్లిమెంటరీ జ్యువెలరీ ట్రస్ట్. ఈ ట్రస్టులలోని 173 ఆభరణాలను విక్రయించకుండా, కేవలం నిజాం కుటుంబ వారసుల హక్కులను కాపాడేలా నిబంధనలు రూపొందించారు. అయితే, కాలక్రమేణా వారసుల మధ్య తలెత్తిన వివాదాలు, పన్ను సమస్యల వల్ల ఈ నిధిని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1970వ దశకంలో నిజాం వారసులు ఈ నగల వేలానికి ప్రయత్నించగా, భారత ప్రభుత్వం జోక్యం చేసుకుంది. "ఇవి దేశం గర్వించదగ్గ జాతీయ సంపద, వీటిని విదేశీయులకు విక్రయించకూడదు" అని కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ కాలం పాటు జరిగిన ఈ న్యాయపోరాటం 1995లో ముగిసి ంది. అప్పట్లో ఈ నగల విలువపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో వీటి విలువ వేల కోట్లు ఉంటుందని అంచనా వేసినప్పటికీ, నిజాం వారసులతో కుదిరిన ఒప్పందం ప్రకారం రూ. 218 కోట్లకు భారత ప్రభుత్వం వీటిని దక్కించుకుంది. ఒప్పందం ప్రకారం, అప్పటి నుంచి ఈ నగలు ముంబైలోని ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలోని అత్యంత సురక్షితమైన రహస్య గదుల్లో భద్రపరిచారు.ఈ 173 నగల సేకరణలో కొన్ని ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి ఉన్నాయి. అందులో జాకబ్ డైమండ్ ఒకటి. ఇది ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద వజ్రం. ఇది 184.75 క్యారెట్ల బరువు కలిగి ఉంటుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటం టే, నిజాం తన టేబుల్‌పై దీనిని ఒక పేపర్ వెయిట్‌గా వాడేవారు. విక్టోరియా వజ్రం కంటే ఇది పెద్దది. ఇంకో ముఖ్యమైన ఆభరణం సత్లదా. ఏడు వరుసల ముత్యాల హారం ఇది. ఇందులో ఉపయోగిం చిన ముత్యాలు ప్రపంచంలోనే అత్యుత్తమమైన 'బస్రా' ముత్యాలు. ఇక నిజాం ఖిల్వత్ అలంకరణలు కూడా పేరెన్నికగన్నవి.
రాజులు ధరించే దస్తార్ (తలపాగా)పై అలంకరించే 'సర్ పేంచ్'లు ఇవి. వీటిలో వజ్రాలు, పచ్చలు, కెంపులు అత్యంత నైపుణ్యంతో పొదగబ డ్డాయి. ఇవేకాక కేవలం పురుషులకే కాకుండా, అంతఃపుర స్త్రీల కోసం రూపొందించిన భారీ కమ్మలు, పట్టీలు, ఉంగరాలు ఇందులో ఉన్నాయి. ఒక్కో ఆభరణం వెనుక నెలల తరబడి శ్రమించిన కళాకా రుల ప్రతిభ కనిపిస్తుంది.హైదరాబాద్ పౌరులు, చరిత్రకారులు ఈ నగలను శాశ్వతంగా హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియ ంలో లేదా చౌమహల్లా ప్యాలెస్‌లో ఉంచాలని కోరుతున్నారు. నిజాం నగలు ఇక్కడ ఉంటే, హైదరాబాద్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఇవి హైదరాబాద్ గడ్డపై పుట్టినవి.



స్థానిక ప్రజలకు తమ పూర్వీకుల సంపదను చూసుకునే హక్కు ఉ ందని భావిస్తారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కూడా వీటి తరలింపుపై కేంద్రానికి లేఖలు రాశాయి.అయితే వీటి తరలింపులో అనేక చిక్కుముళ్లు ఉన్నట్టి కేంద్ర మంత్రి పార్లమెంటులో ప్రకటించారు. వీటిని తరలించడం కేవలం ఒక రాజకీయ నిర్ణయం కాదన్నారు. 1995లో రూ. 218 కోట్లకు కొన్న ఈ నిధి ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 50,000 కోట్లకు పైగానే ఉ ంటుందని అంచనా. ఇంతటి విలువైన సొత్తును రోడ్డు లేదా విమాన మార్గంలో తరలించడం అత్యంత సాహసోపేతమైన ప్రక్రియ. ఈ నగలను ప్రదర్శించే మ్యూజియంకు గాలి చొరబడని బుల్లెట్ ప్రూఫ్ గ్లాసులు, లేజర్ సెక్యూరిటీ సిస్టమ్స్, ఆర్మ్డ్ ఫోర్సెస్ రక్షణ అవసరం. అంతేకాక ఆర్‌బీఐ, భారత ప్రభుత్వాల మధ్య ఉన్న పాత ఒప్పందా లను సవరించాల్సి ఉంటుంది.అయితే నిజాం నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను గుర్తిస్తున్నామని కేంద్రం చెప్పడం ఒక ముందడుగు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా హైదరాబాద్‌కు శాశ్వతంగా తరలించలేకపోతున్నామని చెప్పడం పట్ల చరిత్రకారుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో సాంకేతికత మరింత అభివృద్ధి చెంది, పటిష్టమైన భద్రతతో ఈ నిధి మళ్లీ భాగ్యనగరంలో ప్రదర్శించబడుతుందని ఆశిద్దాం.

# సౌత్ కు బూస్టప్... కారిడార్లు...

హైదరాబాద్: హైదరాబాద్ నుంచి అత్యాధునిక, అత్యంత వేగవంతమై న బుల్లెట్ ట్రైన్లు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏడు హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టుల్ని మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026-27లో ప్రకటించింది. ఈ హైస్పీడ్ ట్రైన్ నెట్‌వర్క్‌లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారనుంది. నగరం నుంచి పుణె, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు హైస్పీడ్ ట్రైన్లు నడవనున్నాయి.హైదరాబాద్ నుంచి పుణె, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లేవారికి గుడ్‌న్యూస్. త్వర్వలోనే ఈ నగరాలకు హైస్పీడ్‌గా చేరుకోనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌లో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రకటించగా.. అందులో మూడు హైదరాబాద్ నుంచే ఉన్నాయి. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె నగరాలకు ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే.. తెలుగు రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల మధ్య కూడా రాకపోకలు వేగవంతమవుతాయి.ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ సీటింగ్ ట్రైన్ల గరిష్ఠ వేగం 150 కి.మీ. కాగా.. త్వరలో ప్రవేశపెట్టనున్న స్లీపర్ ట్రైన్‌కు ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ ట్రైన్ల గరిష్ఠ వేగం 180 కి.మీ. వేగం అందుకుంది. తాజాగా హైస్పీడ్ కారిడార్ ట్రైన్ ప్రాజెక్టులను 350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా డిజైన్ చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు ఎక్స్‌ప్రెస్ ట్రైన్లలో చేరుకునేందుకు 12-15 గంటల సమయం పడుతుండగా.. హైస్పీడ్ కారిడార్ కార్యరూపం దాలిస్తే 3 నుంచి 3.5 గంటల్లోనే ఆయా నగరాలకు చేరుకోవచ్చు.హైస్పీడ్ కారిడార్‌లో హైదరాబాద్ నుంచి ఖమ్మం, కర్నూలు వంటి నగరాలకు గంట సమయంలోనే చేరుకోవచ్చు. ఏపీ రాజధాని అమరావతికి సుమారు 75 నిమిషాలు, అనంతపురం పట్టణానికి 90 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా.. చిన్న నగరాలు,



జిల్లా కేంద్రాలు, పట్టణాల్లోనూ స్టాపేజీలను గుర్తించారు. తెలంగాణలో నార్కట్‌పల్లి, వనపర్తి రోడ్డు, శంషాబాద్ వంటి పట్టణాలతో పాటుగా.. సూర్యాపేట, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి జిల్లా కేంద్రాల్లోనూ ఈ ట్రైన్లు ఆగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, కావలి, గూడూరు వంటి పట్టణాల్లోనూ ఈ ట్రైన్లకు అనుగుణంగా స్టేషన్లు నిర్మించనున్నా రు. ప్రస్తుత రైల్వేలైన్లతో సంబంధం లేకుండా కేవలం వీటి కోసమే కొత్తగా ట్రైన్ లైన్లు నిర్మిస్తారు. కీలకదశలో తుది ఎలైన్‌మెంట్: హైదరాబాద్-పుణె హైస్పీడ్ కారిడార్ జహీరాబాద్, కలబురిగి, శోలాపూర్, పంధార్‌పూర్, అక్లుజ్, దౌడ్, పుణె, స్టేషన్లలో ప్రతిపాదిం చారు. హైదరాబాద్-చెన్నై ఎలైన్‌మెంట్‌ను శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట,ఖమ్మం నుంచి ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపా దించింది. హైదరాబాద్-బెంగళూరు మార్గంలో శంషాబాద్, మహ బూబ్‌నగర్, వనపర్తి రోడ్ మీదుగా రైల్వేశాఖ ప్రతిపాదించింది.తాజా ప్రాజెక్టులతో హైదరాబాద్‌కు చెన్నై, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలతోపాటు.. పుణె, ఖమ్మం, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, అమరావతి, కర్నూలు, కలబురిగి, శోలాపూర్ వంటి నగరాలకు వేగవంతమైన ట్రైన్ కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది.

# వెనిజులాతో ఆయిల్ ఒప్పందం

న్యూఢిల్లీ, : పంచంలో చమురు దిగుమతుల్లో భారత్ రెండో స్థానంలో ఉ ంది. చైనా తర్వాత ఎక్కువ మార్కెట్ ఉన్న దేశం భారతే. అందుకే పెట్రోలియం ఉత్పత్తి దేశాలు భారత్‌కు ఎగుమతి చేయడానికి చూస్తుంటాయి. భారత్ కూడా ఒకే దేశంపై ఆధారపడకుండా వివిధ దేశాలతో అగ్రిమెంట్ చేసుకుంది. ప్రస్తుతం రష్యా నుంచి ఎక్కువ మొత్తంలో చమురు దిగుమతి చేసుకుని యురోపియన్ యూనియన్, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తోంది. ఫలితంగా భారత్ లాభపడు తోంది. అయితే రష్యానుంచి భారత్ చమురు దిగుమతికి చెక్ పెట్టేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చమురు దిగుమతిని సాకుగా చూపి 25 శాతం సుంకాలు విధించారు. తాజాగా వెనెజువెలా చమురు డీల్‌లో భారత్ పాత్రపై అనూహ్య వ్యాఖ్యలు చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరు లతో మాట్లాడుతూ, భారత్ ఆ చమురు దిగుమతులు పెంచనుందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ స్పందించలేదు.వెనెజువెలాలోని భారీగా ఉన్న చమురు నిల్వల కోసమే ట్రంప్ సైలెంట్ ఆపరేషన్ నిర్వహించి అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను ఎత్తుకొ చ్చారు. ప్రస్తుతం ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు స్వీరించారు. ట్రంప్ మాత్రం 'ఆమె నా కోరికల ప్రకారం పాలిస్తోంది. చమురు మొత్తం మాకు చేరే వరకు కొనసాగుతారు' అని ట్రంప్ స్పష్టం చేశారు. 'మేము వెనెజువెలాతో ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్ కూడా చేరనుంది' అని ట్రంప్ తెలిపారు. చైనా కూడా చర్చల్లో ఉందని, దాన్ని స్వాగతిస్తామని చెప్పారు. వెనెజువెలా చమురు నిల్వలు పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉన్నాయని స్పష్టం చేశారు.ఇదిలా ఉంటే.. ఇటీవల భారత ప్రధాని మోదీ, రోడ్రిగ్జ్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులపై ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తన ఆధిపత్యం చాటుకునేందుకు భారత్‌ను బద్నాం చేస్తున్నట్లు తెలుస్తోంది.వెనెజువెలా చమురు కొనుగోలుతో భారత్‌కు చమురు దిగుమతులు సులభమవుతాయి. కానీ అమెరికాకు తొలొగ్గాల్సి ఉంటుంది. చైనా పాల్గొంటే గ్లోబల్ ఎనర్జీ డైనమిక్స్ మారవచ్చు. ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ అధికారికంగా స్పందించలేదు.

# డ్రోన్ హబ్ గా కర్నూలు!




కర్నూలు, : కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో 300 ఎకరాల్లో ఈ డ్రోన్ హబ్ ఏర్పాటు కానుంది. ఇక్కడ విమానశ్రయం, ఫ్లై జోన్ ఉండటం కారణంగానే ప్రభుత్వం ఓర్వకల్లులో ఈ హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అయితే, అందరూ అనుకున్నట్లు ఇది కేవలం డ్రోన్ తయారీ కేంద్రం కాదు. ఇది డ్రోన్‌కు సంబంధించి అన్ని విషయాలకు సమగ్ర కేంద్రంగా నిలవనుంది. ఈ హబ్‌లోనే తయారు చేస్తారు. తయారు చేసిన డ్రోన్లను అన్ని విధాలా పరీక్షించే సదుపాయాలు కల్పిస్తారు. అంతే కాకుండా, వివిధ రకాల సాంకేతికతలను కలబోసి కొత్త తరం డ్రోన్ల తయారీ కోసం పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాలను ఈ డ్రోన్ హబ్‌లో ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు డ్రోన్ల మరమ్మతులు స్టేషన్స్ ఉంటాయి. ఇక డ్రోన్లకు అవసరమైన సర్టిఫికేషన్ (ధృవీకరణ) వంటి సదుపాయాలన్నీ ఇక్కడ లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించడమే ఈ డ్రోన్ హబ్ ముఖ్య లక్ష్యం. కర్నూలులోని ఓర్వకల్లులో ఏర్పాటు చేసే డ్రోన్ హబ్‌కు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే, ప్రపంచంలోనే అతిపెద్ద కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది తయారయిన డ్రోన్ల నాణ్యతకు హామీకి, సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుంది. ఇక్కడ డ్రోన్లను తయారు చేయడమే కాదు. వీటిని ఆపరేట్ చేసే డ్రోన్ పైలట్‌లు, టెక్నీషియన్లు, ఇంజనీర్లను తయారు చేయడానికి శిక్షణా అకాడమీలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు నెలకొల్పుతారు. దీని ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఓర్వకల్లు ప్రాంతం కర్నూలు విమానాశ్రయం, జాతీయ రహదారులకు అనుకూలంగా ఉండటమే కాకుండా, హైదరాబాద్–బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అనుకూలంగా ఉంటుంది. డ్రోన్ హబ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నాయి. కర్నూలులో ఈ డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుంది. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన డ్రోన్ పాలసీ ద్వారా సుమారు వేయి కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రానున్న ఐదేళ్లలో దాదాపు 3 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా. అయితే, ఈ డ్రోన్ సిటీలో ఇప్పటికే డ్రోన్ రంగంలో మంచి పేరున్న సంస్థ గరుడ ఏరోస్పేస్ వంద కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. డ్రోన్ల తయారీ, మరమ్మతులకు సంబంధించిన డ్రోన్–యాజ్–ఎ–సర్వీస్ అందించే అనేక దేశీయ, విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. దీంతో అనేక దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ పెట్టుబడులను ఈ డ్రోన్ సిటీలో పెట్టేందుకు చర్చలు ప్రారంభించాయి. డ్రోన్ హబ్ ద్వారా భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా, ఇక్కడ ఏర్పాటు చేసే నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా 25 వేల మందికి డ్రోన్ పైలట్‌లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

# డెలివరీ బాయ్స్ స్థానంలో డ్రోన్లు..

## గిగ్ వర్కర్స్‌పై ఏఐ పిడుగు!


## లక్షల మంది వీధిన పడే ప్రమాదం



న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు నిపుణులైన ఉద్యోగులకు ప్రత్యామ్నాయంగా మాత్రమే కాకుండా సాధారణ ఉద్యోగుల ఉసురు తీసేందుకు సైతం సిద్ధమవుతున్నది. అనేక సాఫ్ట్‌వేర్ సంస్థలలో నిపుణులైన సిబ్బందికి ప్రత్యామ్నాయంగా ఇప్పటికే అనేక రంగాలను ఆక్రమిస్తున్న ఏఐ.. త్వరలో డెలివరీ బాయ్స్ స్థానాన్ని కూడా ఆక్ర మించనున్నది. అమెజాన్, జెప్టో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, స్విగ్గీ, జొమాటో వంటి డెలివరీ సంస్థలు.. మనం ఆర్డర్ చేసిన వస్తువులను 10 నిమిషాల్లో మన ఇంటి ముందుకు తెస్తున్నాయి. ఇందుకోసం ఆయా సంస్థలు డెలివరీ బాయ్స్‌ను వినియోగిస్తున్నాయి. కాగా.. ఈ డెలివరీ బాయ్స్ స్థానాన్ని త్వరలో డ్రోన్లు ఆక్రమించనున్నాయి. ఇదే జరిగితే ఈ వృత్తిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కొన్ని లక్షల మంది వీధిన పడే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే గుర్గావ్, బెంగళూరు వంటి నగరాల్లో వస్తువుల బట్వాడాకు పలు సంస్థలు డ్రోన్లనే వినియోగిస్తున్నాయి. ఉద్యోగులతో పోల్చుకుంటే అత్యంత వేగంగా, అతి తక్కువ ఖర్చుతో డ్రోన్లు పనిచేస్తున్నాయి. అమెజాన్ సంస్థ అమెరికాలోని తన గోదాములలో ఇప్పటికే ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో ఏఐతో పనిచేసే రోబోలను ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ యాంత్రీకరణకు మద్దతునిస్తున్నాయి.

ఉద్యోగ భద్రత లేదు..: డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్న వారికి ఇప్పటికే ఎటువంటి ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేదు, పీఎఫ్ సదుపాయం లేదు. పని మానేసిన రోజున ఎటువంటి బెనిఫి ట్స్ చేతికందవు. రోజుకు12నుంచి 15 గంటలు పని చేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత లేదు. ఒక్కరోజు పనికి వెళ్లకపోతే.. ఆ రోజుకు ఎటువంటి భత్యం అందదు. ప్రభుత్వ పథకాలు తెలియవు: దేశంలో కోటిమం దికిపైగా ఉన్న గిగ్ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని సదుపాయాలను ప్రకటించింది. ఈ–శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సూచి ంచింది. అలా నమోదైన వారికి ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన సదుపాయాలను కల్పిస్తామని తెలిపింది. అయితే వీటి గురించి చాలామంది గిగ్ వర్కర్లకు తెలియదని గిగ్ వర్కర్స్ యూనియన్ సమన్వయకర్త నిర్మల్ గొరానా చెప్పారు. వారు తమ రోజువారీ ఉపాధిపైనే దృష్టి కేంద్రీకరిస్తారని ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలియదని అన్నారు. వారు పనిచేస్తున్న కంపెనీ వారిని రోడ్డున పడేస్తే,పరిహారం అడిగే హక్కు కూడా వారికి లేదని చెప్పారు.

# పర్యాటకం పగటి కలేనా?



నిర్మల్: కాశ్మీర్ వెళ్లే పనిలేదు.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్న సహ్యాద్రి పర్వత శ్రేణులను చుట్టి వస్తే చాలు.! అంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు పాలకులు ఇస్తున్న హామీలు పగటి కలలుగానే మిగిలిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే సమైక్య ఆంధ్రప్రదేశ్ సహా పక్కనే ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, కర్ణాటక రాష్ట్రాలకు ఒక గొప్ప అనుభూతిని ఇచ్చే పర్యాటక జిల్లాగా పేరు ఉంది. ఉన్న పర్యాటక కేంద్రాలను కాస్త అభివృద్ధి చేస్తే దేశంలోనే గొప్ప పర్యాటక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు కీర్తి వస్తుంది. కానీ, పాలకులు ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవడం లేదు. అంతేకాక ఎన్నికల సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నా అవికార్యరూపం దాల్చడం లేదు. దీంతో ప్రభుత్వాలు, పాలకులపై జిల్లావాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నెన్నో అందాలు...: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవుల ఖిల్లాగా పేరు ఉంది. 60శాతం పైగా అడవులు విస్తరించి ఉన్న జిల్లా కావడంతోపాటు అనేక జలపాతాలు, సెలయేరులు జిల్లాలో విస్తరించి ఉన్నాయి. దీనికి తోడు అనేక చారిత్రాత్మక ప్రదేశాలు కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉండడం విశేషం. అంతటి మహోన్నత ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దే విషయంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయడంలో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆదిమ గిరిజన ఆరాధ్య దైవం కొమురం భీమ్ జన్మించిన జోడెన్ ఘాట్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా ఆచరణకు నోచుకోలేదు. మ్యూజియం పనులు మినహా ఇతర అభివృద్ధి పనులు జరగడం లేదు. ఆ ప్రాంతానికి ఉట్నూరు లేదా ఆసిఫాబాద్ మీదుగా కెరామెరి ఘాట్స్ మీదుగా వెళ్తే కాశ్మీర్ వెళ్లినట్లే. అలాగే ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలు కనువిందు చేస్తాయి. జైనాథ్ సూర్య దేవాలయం, నాగోబా ఆలయం, ఉట్నూర్ గోండుల జిల్లా, సిర్పూర్ పేపర్ మిల్లు, సింగరేణి కోల్ మైన్స్, బాసర అమ్మవారి క్షేత్రం, నిర్మల్ కొయ్య బొమ్మలు, కడెం కవ్వాల్ అభయారణ్యం ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కనీసం 20కి పైగా మంచి పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వీటిని తీర్చిదిదితే కనీసం మూడు నుంచి నాలుగు రోజులపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటకులు గడపడంతోపాటు, మంచి అనుభూతిని పొందే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వాల ఉదాసీనత కారణంగా ఉమ్మడి జిల్లాలో పర్యాటకం పడకేస్తున్నది. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి రూ.100కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అది ఉట్టిదేనని తేలిపోయింది.

ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి సైతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. గతంలో మాదిరిగా కాకుండా తాము కచ్చితంగా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన 10మంది ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు రాజకీయాలను పక్కనపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్చార్జి మంత్రి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి నిధుల మంజూరుకు ఒత్తిడి చేస్తే కచ్చితంగా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు కోరుతున్నారు.

బెంగళూరులో దారుణం


# వైద్యం పేరుతో యువతిపై డాక్టర్ లైంగిక వేధింపులు

- పరీక్ష పేరుతో అరగంట పాటు నరకం చూపించిన వైద్యుడు
- క్లినిక్ ముందు బాధితురాలి కుటుంబం ఆందోళన
- డాక్టర్‌ను అరెస్ట్ చేసి కస్టడీకి తరలించిన పోలీసులు
- అపార్థం చేసుకున్నారంటూ ఆరోపణలు ఖండించిన నిందితుడు



బెంగళూరు: వైద్యుడి చేతిలో ఓ యువతి లైంగిక వేధింపులకు గురైన దారుణ ఘటన బెంగళూరులో వెలుగుచూసింది. చర్మవ్యా ధికి చికిత్స కోసం తన క్లినిక్‌కు వచ్చిన 21 ఏళ్ల యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆరోపణలపై పోలీసులు 56 ఏళ్ల డెర్మటాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలు శనివారం సాయంత్రం డాక్టర్ ప్రవీణ్ ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లింది. సాధారణంగా ఆమె తన తండ్రితో కలిసి క్లినిక్‌కు వస్తుంటుంది, కానీ ఆ రోజు ఆయనకు వీలు కాలేదు. యువతి ఒంటరిగా రావడాన్ని అదునుగా తీసుకున్న డాక్టర్ పరీక్ష పేరుతో ఆమెను అరగంట పాటు లైంగికంగా వేధించినట్టు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. చర్మ ఇన్ఫెక్షన్‌ను పరిశీలించే నెపంతో తనను అసభ్యంగా తాకాడని, బలవంతంగా కౌగిలించుకుని చాలాసార్లు ముద్దు పెట్టాడని ఆమె ఆరోపించింది. ఆమె ప్రతిఘటించినా వినకుండా, పరీక్షలో భాగంగా దుస్తులు విప్పమని బలవంతం చేశాడని తెలిపింది. అంతటితో ఆగకుండా, ఇద్దరూ కలిసి హొటల్ రూమ్‌లో గడుపుదామంటూ అసభ్యకరమైన ప్రతిపాదన కూడా చేసినట్టు యువతి పోలీసులకు వివరించింది. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు క్లినిక్ వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న అశోక్ నగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, డాక్టర్ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, డాక్టర్ ప్రవీణ్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తాను కేవలం వైద్య పరీక్ష మాత్రమే చేశానని, యువతి తన చర్యలను అపార్థం చేసుకుందని వాదించారు. పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 75, 79 కింద కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

# ఆ నాలుగు ప్రాంతాలకు మహర్దశ



నిజామాబాద్, : హైదరాబాద్: తెలంగాణలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. తెలంగాణలో ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చేపట్టాల్సిన 4 జాతీయ రహదారులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా ఆర్మూర్– జగిత్యాల, జగిత్యాల–కరీంనగర్, జగిత్యాల– మంచిర్యాల జాతీయ రహదారు లకు సంబంధించి టెండర్లను ఆహ్వానించింది. అంతకుముందు మహబూబ్‌నగర్–గూడెబల్లూర్ హైవేకి సంబంధించిన టెండర్లను గత నెలలోనే ఆహ్వానించింది. ఈ నాలుగు రహదారులను ఎన్‌హెచ్ఏఐ మొత్తం 271 కి.మీ. మేర రూ. 10,034 కోట్లతో నిర్మించనుందని సమాచారం. ఈ డిసెంబరులో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరం, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ పనులు ప్రారంభించేలా ఎన్‌హెచ్ఏఐ చర్యలు చేపట్టనుంది. ఇందులో జగిత్యాల– మంచిర్యాల హైవేని ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో నిర్మించనున్నారు. మిగతా మూడింటిని హ్యామ్ విధానంలో వేయనున్నారు. ఈ నాలుగు రహదారులకు పర్యావరణ, అటవీ, రైల్వే అనుమతులు పూర్తయ్యాయి. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తే వెంటనే పనులు మొదలవుతాయి.

జాతీయ రహదారుల వివరాలు..: మహబూబ్‌నగర్– గూడెబల్లూర్ జాతీయ రహదారి: 80 కి.మీ. మేర రూ. 2,662 కోట్లతో జాతీయ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం 465.7 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఆర్మూర్– జగిత్యాల జాతీయ రహదారి: 64 కి.మీ. మేర రూ. 2,338 కోట్లతో నిర్మించనున్నారు. ఇందుకు 288.3 హెక్టార్ల భూమి సేకరించనున్నారు. జగిత్యాల–కరీంనగర్: 59 కి.మీ. నేషనల్ హైవేను రూ. 2,484 కోట్లతో నిర్మిస్తారు. ఇందుకు 306.7 హెక్టార్ల భూసేకరణ చేయాలి.

# ఊడ్చే యంత్రాలతో ఖజనా ఊడ్చేశారు...

హైదరాబాద్, : సాధారణంగా పారిశుధ్యానికి నగరపాలక సంస్థలు భారీగా ఖర్చు పెడుతుంటాయి. ఒకప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ మొత్తం మనుషులు చేసేవారు. అయితే నగరాలు విస్తరించడం వల్ల.. శివారు ప్రాంతాలు పెరిగిపోవడం వల్ల పారిశుద్ధ్య నిర్వహణ మనుషుల వల్ల కావడం లేదు. అందుకే నగరపాలక సంస్థలు చెత్త ఊడ్చడానికి ఖరీదైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే భారీగా డబ్బులు కావాలి. అందువల్లే అవి అద్దె ప్రాతిపదికన తీసుకొస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటికి చెల్లించే అదే భారీగా ఉంటున్నది. వాస్తవానికి ఆ స్థాయిలో చెల్లించే అద్దె ద్వారా కొత్త యంత్రాలు కొనుగోలు చేయవచ్చు. కానీ నగరపాలక సంస్థల్లో వ్యవహారం వేరే విధంగా ఉంటుంది కాబట్టి వందల కోట్లలో అద్దె చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు. మనదేశంలో ప్రఖ్యాత నగరపాలక సంస్థల్లో బెంగళూరు ఒకటి. బెంగళూరు నగరం మనదేశ ఐటీ రాజధానిగా పేరుపొందింది. ఇక్కడ అనేక బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంతో పోల్చి చూస్తే బెంగళూరు నగరం కూడా విపరీతంగా పెరిగింది. పెరిగిన నగరానికి తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ మీద పడింది. వాస్తవానికి బెంగళూరులో రోడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇక సాయంత్రం పూట ట్రాఫిక్ చెప్పాల్సిన పనిలేదు. వర్షం కురిస్తే మాత్రం నరకం కనిపిస్తుంది. బెంగళూరులో ప్రతిరోజు చెత్త భారీగా పోగుపడుతుంది. ఇలా పోగు పడిన చెత్తను శుభ్రం చేయాలంటే కార్మికులకు తలకు మించిన భారమవుతోంది. ఏటికేడు ఈ సమస్య పెరిగిపోతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం 613 కోట్ల విలువైనది. ఇంతటి డబ్బు పెట్టి కొత్త యంత్రాలు కొనుగోలు చేస్తున్నారనుకుంటే పొరపాటే. బెంగళూరు నగరపాలక పరిధిలో చెత్తను శుభ్రం చేయడానికి.. రోడ్లను ఊడ్చడానికి ఏకంగా 46 స్వీపింగ్ యంత్రాలను బెంగళూరు నగరపాలక సంస్థ అధికారులు అద్దెకు తీసుకున్నారు.

ఏడు సంవత్సరాలపాటు ఈ యంత్రాలను వాడుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి కర్ణాటక రాజధాని అయిన బెంగళూరు నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమైనప్పటికీ.. ఇంతటి ఖర్చుపెట్టి.. అది కూడా యంత్రాలను అద్దెకు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇలాంటివి సహజమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

# సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు

హైదరాబాద్, : హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఎంత చెప్పినా తక్కువే. మెట్రో రన్ అవుతున్నా, ఎక్కడిక్కక్కడ ఫ్లైఓవర్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ చిక్కులు నగరవాసులకు తప్పడం లేదు. ముఖ్యంగా నార్త్ సిటీ వైపు పరిస్థితి మరింత హారిబుల్‌గా ఉంటుంది. అందుకే దీనికి పరిష్కారంగా అధికారులు చర్యలు చేపట్టారు. ప్యారడైజ్ కూడలి నుంచి సమీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హైదరాబాద్ రోజురోజుకు చాలా వేగంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణ కారణంగా శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే దీని నుంచి ఉపశమనం కోసం మెట్రో విస్తరణకు ప్రణాళికలు రచించారు. కానీ అది ముందుకు కదలడం లేదు. అందుకే ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నార్త్‌సిటీపై ఎక్కువ ఫోకస్ చేశారు. ప్యారడైజ్ సర్కిల్ నుంచి మేడ్చల్, సమీర్‌పేట వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. ఈ మార్గం కేలం నిత్యం ప్రయాణించే లోకల్ వాహనాలే కాకుండా, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాణిజ్య వాహనాలకు కూడా ప్రధాన రహదారి. దీంతో సాధారణ ప్రయాణ సమయం అంచనాలకు మించి పెరుగుతోంది. ఈ మార్గంలోఉదయం, సాయంత్ర వేళల్లో ట్రావెల్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ట్రాఫిక్ జామ్‌లు, వర్షాలు పడితే సమస్యలు మరింత రెట్టింపు అవుతున్నాయి. వీటికి పరిష్కార మార్గంగానే ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని అధికారులు ప్రణాళికలలు సిద్ధం చేశారు.

# బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు



విజయవాడ, : ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.


వానాకాలం ఆ సమస్యలు వేధిస్తున్నాయా..

# వేపతో చక్కటి పరిష్కారం..!



మన దేశంలోని సాంప్రదాయక వైద్య విధానాల్లో వేపకు చాలా ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా వానాకాలంలో సంక్రమించే చర్మ సంబంధితమైన సమస్యల కు వేపకు మించిన పరిష్కారం లేదని నిపుణులు చెబుతున్నారు. వేప నూనె, వేప ఆకులు, వేప పసరు ఇలా ఎన్నో రకాలుగా వేపను సమస్యల పరిష్కారానికి వినియోగించ వచ్చు. వేపలో నింబిడిన్, అజాడిరెక్టిన్, ఫ్లేవనాయిడ్స్ లాంటి బయోయాక్టివ్ రసాయనాలు ఉన్నాయి. వీటి కారణంగా ఫంగల్, బ్యాక్టీరియల్ వ్యాధులతోపాటు ఇన్ఫ్లమేషన్ నుంచి కూడా రక్షణ లభిస్తుంది. వానాకాలంలో గాల్లో తేమ ఎక్కువగా ఉంటుంది. ఫలిత ంగా చర్మ సంబంధిత సమస్యలు మొదలవుతాయి. వీటికి వేప చక్కని పరిష్కారం చూపుతుంది. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు చెమట ఎక్కువగా ఉత్పత్తి అయ్యి చర్మ రంధ్రాలు మలినా లతో పూడుకుపోతాయి. అది చివరకు బ్లాక్ హెడ్స్, పింపుల్స్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. వేపలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల కారణంగా బ్యాక్టీరియా ఇబ్బంది తొలగి చర్మానికి స్వాంతన దొరుకుతుందని నిపుణులు చెబుతున్నారు. చర్మంపై తెల్లని పొట్టు రేగడాన్ని ఎగ్జిమా అంటారు. ఈ సమస్య ఉన్న వారిని దురద కూడా వేధిస్తుంది. వానా కాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. వేపలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఎగ్జిమా నుంచి ఉపశమనం కలిగిస్తాయని హెల్త్ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. ఫైటో కాంపౌండ్స్, ఫ్లేవనాయిడ్స్, అజాడిరాడియోన్ కాంపౌండ్స్ ఎగ్జిమా తీవ్రం కాకుండా నిరోధిస్తాయని అంటున్నారు. సోరియాసిస్ ఉన్న వారిలో చర్మంపై పొలుసులతో కూడిన ఎర్రటి ప్యాచెస్ ఏర్పడతాయి. దురద కూడా పెరుగుతుంది. వానాకాలంలో గాల్లోని తేమ కారణంగా సమస్య మరింత తీవ్రమవుతుంది. అయితే వేప పసరు చర్మానికి రాసుకుంటే సోరియాసిస్ నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వేప నూనెలో గాయాలను త్వరగా మానేలా చేసే గుణం కూడా ఉందని తెలుపుతున్నారు. అదేవిధంగా వానాకాలంలో అథ్లెట్స్ ఫూట్, రింగ్ వార్మ్, కాండిడియాసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు కూడా ఎక్కువవుతాయి. అయితే వేపలోని యాంటీఫంగల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఈ సమస్యలకు సులువుగా చెక్ పెడతాయి. ఫంగస్ పెరుగుదలను అడ్డుకుని వ్యాధులను నిరోధిస్తాయి. కాబట్టి ఈ కాలంలో వచ్చే అనేక సమస్యలకు వేప మంచి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు.

# మఖానా.. మంచిదేనా?



'ఫూల్ మఖానా'ను చాలామంది హెల్దీ స్నాక్స్‌గా తీసుకుంటున్నారు. శరీరానికి కావాల్సిన ప్రొటీన్, ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లను పొందుతున్నారు. ఆరోగ్యానికి భరోసానిచ్చే ఈ తామర విత్తనాలు.. కొందరికి మాత్రం హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్నిరకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు.. 'మఖానా'కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. గర్భిణులు మఖానాను పరిమితంగానే తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకుంటే.. శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది. దాంతో అసౌకర్యం ఏర్పడుతుంది. కాబట్టి, వైద్యుడిని సంప్రదించిన తర్వాతే.. మఖానాను తినాలి. కిడ్నీ సమస్యలతో బాధపడేవారికీ.. మఖానా మంచిది కాదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. మూత్రపిండాల సమస్య ఉన్నప్పుడు.. శరీరంలో పొటాషియం స్థాయులు పెరుగుతాయి. దీర్ఘకాలంలో గుండె సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి, కిడ్నీరోగులు 'మఖానా' ముట్టకుంటేనే బెటర్! మఖానా తింటే కొందరిలో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే ఫైబర్.. కొన్నిసార్లు గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను సృష్టిస్తుంది. అల్సర్, గుండెల్లో మంట, ఇతర జీర్ణ సమస్యలుంటే.. మఖానాను పక్కన పెట్టేయాలి. కొందరిలో 'మఖానా' అలెర్జీలకు దారితీస్తుంది. చర్మంపై దద్దుర్లు, దురద, ఇతర ఇన్ఫెక్షన్లు కనిపిస్తాయి. మఖానా తిన్నప్పుడు ఏదైనా అలెర్జీ వచ్చినట్లయితే.. వీటికి దూరంగా ఉండాలి. తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. మఖానాలో కార్బోహైడ్రేట్లు అధిక మొత్తంలో లభిస్తాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయులను పెంచుతాయి. కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారు వీటికి దూరంగా ఉండటమే మంచిది. వైద్యుడి సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి.

# షుగర్ ఉన్నా.. ఈ నాలుగు ఫ్రూట్స్ తినొచ్చు!

సాధారణంగా పండ్లు తియ్యగా ఉంటాయి కాబట్టి, అందులో చక్కెర ఉంటుందని, డయాబెటిస్ ఉన్నవారు తినకూడదని అనుకుంటారు. అయితే కొన్ని పండ్లను మధుమేహులు కూడా నిరభ్యంతరంగా తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతూనే, అవసరమైన పోషకాలను అందించే నాలుగు పండ్ల గురించి తెలుసుకుందాం.

ఆహారపు అలవాట్లపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మధుమేహ రోగులు పండ్లకు దూరంగా ఉంటారు. పండ్లలో సహజ సిద్ధమైన చక్కెర ఉంటుందనే భయంతో వాటిని తినడానికి సందేహిస్తారు. కానీ కొన్ని పండ్లు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) కలిగి ఉంటాయి, ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. అటువంటి పండ్లను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన రీతిలో పోషకాలను పొందవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేసే పండ్లు

యాపిల్స్: వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను నెమ్మదించేలా చేస్తుంది, తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా నిరోధిస్తుంది. యాపిల్స్ తినడం వల్ల కడుపు నిండిన భావన కలిగి, అనవసరమైన స్నాక్స్ తీసుకోవాలనే కోరిక తగ్గుతుంది.

నారింజ: విటమిన్ సి కి గొప్ప వనరు అయిన నారింజలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా సహాయపడతాయి.



బెర్రీ పండ్లు: స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా, శరీరంలో ఇన్ ఫ్లమేషన్ ను తగ్గించడంలో కూడా దోహదపడతాయి.

కివి ఫ్రూట్స్: కివిలో విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఇది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

అయితే, మధుమేహులు పండ్లను తీసుకునేటప్పుడు వాటి పరిమాణంపై శ్రద్ధ వహించాలి. ఏవైనా సందేహాలుంటే, మీ వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించడం మంచిది. వారు మీ ఆరోగ్య పరిస్థితికి తగిన సలహాలను అందిస్తారు.

# నేరేడు పండ్ల లాభాలు తెలిస్తే వదలరు..

పండ్లలో నేరేడు పండు ఒకటి. ఇందులో విటమిన్ సి, ఐరన్, పొటాషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కావున వీటిని తింటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం రెండింటి లోనూ దీన్ని ప్రయోజనకరంగా పరిగణిస్తారు. డయాబెటిస్ ఉన్నవారికి నేరేడు పండ్లు ఎంతో మేలు చేస్తాయి. దీనిలో ఉండే జాముస్, జాము సీన్ వంటి రసాయనాలు రక్తంలోని చక్కెర స్థాయిని నియంత్రించడం లో సహాయపడతాయి. అలాగే, ఇందులో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, అజీర్ణం, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. నేరేడు పండ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని వైరస్, బ్యాక్టీరియా నుంచి రక్షిస్తాయి. అలాగే, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు దీని తినొచ్చు. ఇందులో తక్కువ కేలరీలు,



అధిక ఫైబర్ ఉంటుంది. కావున దీన్ని తీసుకున్నప్పుడు కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇది జీవక్రియను వేగవంతం చేసి బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మ ఆరోగ్యానికి కూడా నేరేడు ఉపయోగపడుతుంది. ఇందులోని విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. ఇది కాలేయాన్ని శుభ్రపరచి ఫ్యాటీ లివర్ వంటి సమస్యల నుంచి రక్షిస్తుంది.

# నాన్ వెజ్ తినలేని వారికి వరం ఈ గింజలు.. తరచూ తింటే ఎన్నో లాభాలు..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం వ్యాయామం చేయడం మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా తినాల్సి ఉంటుంది. కొందరు వ్యాయామం అయితే చేస్తారు కానీ అనారోగ్యకరమైన ఆహారాలను తింటారు. దీంతో వ్యాయామం చేసిన ఫలితం దక్కదు. కనుక ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం కూడా ముఖ్యమే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇక అలాంటి ఆరోగ్యకరమైన శక్తినిచ్చే ఆహారాల్లో రాజ్మా గింజలు కూడా ఒకటి. ఇవి చిక్కుడు జాతికి చెందినవి. చూసేందుకు ముదురు గోధుమ రంగులో అచ్చం కిడ్నీల్లాగే ఉంటాయి. అందుకనే ఈ గింజలను కిడ్నీ బీన్స్ అని కూడా అంటారు. రాజ్మా గింజలను ఉత్తరాది వారు ఎక్కువగా తింటారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఈ గింజలను తినడం వల్ల శక్తి లభించడమే కాదు, పోషకాలను కూడా పొందవచ్చు. అలాగే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. రాజ్మాను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

అధికంగా ప్రోటీన్లు..: రాజ్మా గింజల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా నాన్ వెజ్ తినలేని వారు ఈ గింజలను తింటే ప్రోటీన్లు అధికంగా లభిస్తాయి. దీని వల్ల శరీర కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. కండరాలు నిర్మాణమవుతాయి. కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఒక కప్పు రాజ్మా గింజలను తింటే చాలు మనకు రోజుకు కావల్సిన ప్రోటీన్లు మొత్తం లభిస్తాయి. అందువల్ల నాన్ వెజ్ తినలేని వారికి రాజ్మా గింజలు ఉత్తమ ఆహారం అని చెప్పవచ్చు. అలాగే శారీరక శ్రమ చేసేవారు, వ్యాయామం అధికంగా చేసే వారు సైతం ఈ గింజలను తినవచ్చు. దీంతో కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు. కండరాలు నిర్మాణమవుతాయి. మళ్లీ ఉత్సాహంగా పనిచేసేందుకు కావల్సిన శక్తి లభిస్తుంది. చురుగ్గా ఉంటారు. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. బద్ధకం పోతుంది. బలహీనంగా ఉన్నవారు రాజ్మాను ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

మలబద్ధకానికి చెక్..: ఈ గింజలను తింటే ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీంతో పేగుల్లో మలం కదలికలు సులభతరం అవుతాయి. మలబద్ధకం తగ్గుతుంది. ఈ గింజలు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ సైతం పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

షుగర్ ఉన్నవారికి..: రాజ్మా గింజల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ గింజలను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. పైగా ఈ గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక షుగర్ లెవల్స్‌ను తగ్గేందుకు దోహదం చేస్తుంది. రాజ్మాను తింటే శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ గింజల్లో ఫైబర్, పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తాయి. రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అధిక బరువు ఉన్నవారు ఈ గింజలను తింటే త్వరగా బరువు తగ్గుతారు. ఈ గింజల్లో ఉండే క్యాల్షియం ఎముకలను బలంగా మారుస్తుంది. ఇలా రాజ్మా గింజలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## కొబ్బరి నీళ్లు ఎన్ని తాగాలి?



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలని అందరికీ తెలిసిందే. ఎవరికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా%% కొబ్బరి నీళ్లు తాగమని సలహా ఇస్తుంటారు. రోగాలతో ఉన్నవాళ్లకే కాదు ఆరోగ్యంగా ఉన్నవాళ్లకూ ఇందులో ఉండే పోషకాలు అవసరమే.

అయితే, అధికంగా పోషకాలు ఉండే కొబ్బరి నీళ్లను ఎన్ని తాగాలి? ఎన్నిసార్లు తాగాలో అవగాహన తక్కువే! పరిమితిని మించితే ఔషధం కూడా వికటిస్తుంది. ఎక్కువ మోతాదులో లవణాలు ఉండే కొబ్బరి నీళ్లను పరిమితంగా తాగడమే మేలని చెబుతున్నారు నిపుణులు. కొందరైతే.. కొబ్బరినీళ్ల లీటర్ బాటిల్ కొని గటగటా తాగేస్తుంటారు. ఇంకొందరు రెండుసార్లు విరామం ఇస్తూ లీటర్ పట్టిస్తారు. అన్నేసి కొబ్బరినీళ్లు తాగితే.. కిడ్నీలు, ఇతర అవయవాలపై భారం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి 150-200 మిల్లీలీటర్లు తాగితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యవంతులు వారంలో మూడు నుంచి నాలుగుసార్లు కొబ్బరినీళు తాగొచ్చు. అది కూడా ఉదయం, సాయంత్రాల్లో శారీరక శ్రమ చేసిన తర్వాత లేదా వ్యాయామం ముగించిన తర్వాత కొబ్బరి నీళ్లు తాగడం మేలు! కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం రక్తపీడనాన్ని నియంత్రణలో ఉంచుతుంది. శరీరానికి కావాల్సిన గ్లూకోజ్‌ను వేగంగా అందిస్తుంది. కాళ్ల తిమ్మిర్లు తగ్గిస్తుంది.

## మీకు ఈ నట్స్ గురించి తెలుసా..?

బాదంపప్పు, పిస్తా, జీడిపప్పు.. ఇలా చాలా రకాల నట్స్ గురించి మనకు తెలుసు. కానీ మీరు ఎప్పుడైనా టైగర్ నట్స్ గురించి విన్నారా..? వీటిని మీరు సూపర్ మార్కెట్లలో చూసే ఉంటారు. కానీ వీటి పేరు టైగర్ నట్స్ అని మీకు తెలిసి ఉండదు. ఇతర నట్స్ లాగే ఈ నట్స్ కూడా మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని కూడామనం ఆహారంలో భాగం చేసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను చుఫా లేదా ఎర్త్ ఆల్మండ్స్ అని పిలుస్తారు. అయితే ఇవి నట్స్ జాబితాకు చెందుతాయి. కానీ భూగర్భంలో పండుతాయి. ఈ నట్స్ మీద ముడతలు పడినట్లు తొక్క ఉంటుంది. ఇవి కాస్త తియ్యగా, క్రీమ్ రుచిని కలిగి ఉంటాయి. సాధారణ నట్స్ అంటే అలర్జీ ఉన్నవారు టైగర్ నట్స్‌ను తీసుకోవచ్చు. టైగర్ నట్స్‌ను రోజూ గుప్పెడు మోతాదులో తింటే అనేక లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ నట్స్‌ను తింటుంటే పలు వ్యాధులు నయం అవుతాయని అంటున్నారు.

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..:టైగర్ నట్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థనుఆరోగ్యంగా ఉంచుతుంది.పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉండేలా చేస్తుంది. దీంతోమలబద్ధకం తగ్గుతుంది. ఈ నట్స్‌లో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది. ఇది కూడా ఫైబర్ లాగే పనిచేస్తుంది. ఈ నట్స్‌ను తింటే ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. టైగర్ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తి మెరుగు పడుతుంది. ముఖ్యంగా అమైలేజ్, లైపేజ్, కాటలేజ్ అనే ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి తగ్గుతాయి.

గుండె సంరక్షణకు..: టైగర్ నట్స్‌ను తింటే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. ఇవి శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. టైగర్ నట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ ఉంటుంది.

ఇది రక్త నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు రోజూ ఈ నట్స్‌ను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. బీపీని అదుపులో ఉంచుకోవచ్చు. ఈ నట్స్‌లో విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గుండెను, రక్త నాళాలను సంరక్షిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె సురక్షితంగా ఉంటుంది.

డయాబెటిస్ ఉంటే..: టైగర్ నట్స్‌లో అధికంగా ఉండే ఫైబర్ కారణంగా తిన్న ఆహారంలో ఉండే పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ నట్స్‌లో ఉండే అర్జినైన్ అనే సమ్మేళనం ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకునేలా చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారు ఈ నట్స్‌ను రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. టైగర్ నట్స్‌లో విటమిన్ సి, ఇ అధికంగా ఉంటాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు సైతం ఎక్కువగానే ఉంటాయి, ఇవి ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఈ నట్స్‌లో అధికంగా ఉండే జింక్, ఐరన్ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. టైగర్ నట్స్‌లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి.

# మా నిలయం.. ఓ గ్రంథాలయం




చాలామంది రిటైర్ అయ్యాక విశ్రాంతిని కోరుకుంటారు. కానీ, రిటైర్డ్‌లైఫ్‌ను సమాజానికి అంకితం చేశారు ఈ దంపతులు. ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్న గ్రామీణ యువత కోసం తమ నివాసాన్నే గ్రంథాలయంగా మార్చారు. నిరుద్యోగులకు బతుకుబాట చూపుతున్నారు. వారే ఖమ్మం పట్టణానికి చెందిన చావా దుర్గాభవాని, పారుపల్లి అజయ్‌కుమార్ దంపతులు. రూ.20 లక్షలు వెచ్చించి గ్రంథాలయం ఏర్పాటు చేసి, ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఉద్యోగార్థులకు చుక్కానిగా నిలుస్తున్న ఈ దంపతులను జిందగీ పలకరించింది. ఆ విశేషాలే ఇవి.. తమ తండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో వాళ్ల ప్రభావం ఈ ఇద్దరిపై పడింది. ఆ స్ఫూర్తితోనే టీచరు కొలువులు సాధించారు. అందుకే వారి జ్ఞాపకార్థంగా వారి పేర్లను తమ గ్రంథాలయానికి పెట్టుకున్నారు.పెద్ద రీడింగ్ హాల్‌కు అజయ్ కుమార్ తండ్రి పేరుతో 'పారుపల్లిసత్యనారాయణ పుస్తక పూదోట' అని,మినీ రీడింగ్ హాల్‌కు దుర్గా భవాని తండ్రి పేరైన 'చావా రామారావు' అని పేరు పెట్టి విజ్ఞానాన్ని అందిస్తున్నారు. పోటీపరీక్షలతోపాటు సాహితీ ప్రియుల కోసం వివిధ భాషలకు చెందిన గ్రంథాలను ఇక్కడ పొందుపరిచారు.'ఇద్దరం గొప్పగా చదువుకున్నాం. మంచి ఉదోగ్యాల్లో స్థిరపడ్డాం! ఇక సమాజంతో మనకేంటి పని' అని ఏనాడూ అనుకోలేదు ఆ దంప తులు. ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి.. సమాజ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించారు అజయ్, దుర్గాభవాని. పదవీ విరమణ తర్వాత కూడా అదే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన చావా దుర్గా భవానికి చదువంటే ఇష్టం. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో కూతురును చక్కగా ప్రోత్సహిం చాడు. అలా కష్టపడి 1997లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించింది. అదే జిల్లాకు చెందిన పారుపల్లి అజయ్‌కుమార్ కూడా చదువులో మొదట్నుంచీ చురుకే! ఇంటర్ కాగానే టీటీసీ పూర్తిచేశారు. 1986లో ఎస్‌జీటీ టీచర్‌గా తన ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. అజయ్, దుర్గ బంధువులు కావడంతో ఇద్దరికీ పెద్దలు పెండ్లి నిశ్చయం చేశారు.

అజయ్ ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదివి జూనియర్ కాలేజీ అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. అధ్యాపకుడిగా రిటైర్ అయ్యారు. తండ్రి ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నా.. దుర్గాభవాని బాల్యంలో ఆటుపోట్లకు కొదువ లేదు. 'బతకలేక బడిపంతులు' అనే ఆ రోజుల్లో.. వాళ్ల కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తరచూ సవాళ్లు విసిరేవి. కొత్త పుస్తకాలు కొనాలన్నా జేబులు తడుముకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. సెకండ్ హ్యాండ్ పుస్తకాలు కొని చదువు వెళ్లదీసింది దుర్గా భవాని. మరోవైపు చిన్నప్పుడు అజయ్ కుమార్ పరిస్థితీ దాదాపు ఇంతే! ఇద్దరూ కష్టాలు చూసి పెరిగిన వాళ్లు కావడంతో, వృత్తిలో స్థిరపడిన తర్వాత కష్టాల్లో ఉన్న ఇతరులను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించారు. ఉప్పు, పప్పు దానం చేసి గొప్పకు పోలేదు వాళ్లు. విద్యార్థులకు అండగా నిలిచారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు, ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతకు అండగా నిలవాలని భావించారు.

**రూ.20 లక్షలు వెచ్చించి..:** కుటుంబ బాధ్యతలు ఎన్ని ఉన్నా.. ఉన్నంతలో నలుగురికి సాయం చేస్తూ వచ్చారు. రిటైర్ అయ్యాక కూడా పనిచేస్తూనే ఉండాలనే ఆలోచన అజయ్‌ది. తాను రిటైర్ అవ్వగానే భార్యతో 'ఇకనుంచి ఈసామాజానికి మరింత సేవ చేయాలనుంది' అని తన మనసులో మాట చెప్పారు. అందుకు ఆమె కూడా అంగీకరించింది. ఇద్దరూ ఒక్కటిగా ఆలోచించి.. తమలాగా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలనే వారికి చే యుతనివ్వాలని నిర్ణయానికి వచ్చారు. పదిమందికి డబ్బులివ్వడం తోనో, నాలుగు పుస్తకాలు కొనివ్వడంతోనో తమ బాధ్యత పూర్తవు తుందని అనుకోలేదు.తమ ఇంటినే గ్రంథాలయంగా మార్చారు. ఉద్యోగార్థులు, విద్యార్థులు తమ ఇంటికి వచ్చి కావాల్సినవి చదువుకునేలా ఏర్పాటు చేశారు. అలా వికసించిన విద్యావనమే 'పారుపల్లి సత్యనారాయణ పుస్తక పూదోట'. తమ ఇంట్లోని మొదటి అంతస్తు మొత్తాన్ని గ్రంథాలయంగా మార్చేశారు. రూ.20 లక్షలు వెచ్చించి.. మౌలిక వసతులు కల్పించడంతోపాటు పుస్తకాలు సమకూర్చారు.

అలా 2019లో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. లైబ్రరీ నిర్వహణ, కొత్త పుస్తకాలు తీసుకురావడం ఇవన్నీ అజయ్‌కుమార్ పనులు. యువతకు ఉద్యోగ నోటిఫికేషన్ల వివరాలు తెలియపరచడం, సిలబస్ వివరించ డం దుర్గాభవాని కర్తవ్యం. ఇలా ఇద్దరూ కలిసి తమ ఇంటిలో 8000కు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచి.. నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్నారు.

**ఎందరికో కొలువులు:** ఖమ్మం చుట్టుపక్కల గ్రామాల నుంచి పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఈ గ్రంథాలయం ఓ దేవాలయంతో సమానం. వేలకు వేలు కట్టి కోచింగ్ తీసుకోలేని వారికి ఉ



చితంగా పుస్తకాలిచ్చి ఉద్యోగం వచ్చేవరకు చదివిస్తున్నారు వీళ్లు. దూరప్రాంతాలకు చెందినవాళ్లు సైతం టౌన్‌లోనే రూమ్ అద్దెకు తీసుకొని నిత్యం ఈ గ్రంథాలయానికి వచ్చి తమ ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఇక్కడ చదువుకున్నవాళ్లలో 15 మంది పోలీసు ఉద్యోగాలు, 25 మంది టీచర్ కొలువులు సాధించడంతోపాటు పలువురు నేవీ, ఆర్మీ, రైల్వే లాంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రంథాలయ నిర్వహణకు గానూ ప్రతి నెలా రూ.25 వేలకుపైగా సొంత నిధులు ఖర్చుచేస్తున్నారు అజయ్, దుర్గాభవాని దంపతులు.

భవిష్యత్తులో మరిన్ని సేవలు..:

ప్రతిపనిలో కూడా జవాబుదారీగా ఉండాలనే ఆలోచనతో వాళ్ల సన్నిహితులతో కమిటీ ఒకటి వేసుకున్నారు. ఇక్కడ చదువుకొని ఉద్యోగాలు సాధించిన వాళ్లు ఎంతో కొంత డొనేషన్ రూపంలో పంపుతుంటారు. ఆ డబ్బుతో పుస్తకాలు కొంటుంటారు. ప్రస్తుతం దుర్గాభవాని ఖమ్మం పట్టణంలోనే ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. లైబ్రరీ నిర్వహణలో ఇద్దరూ తలమునకలుగా ఉంటారు. భవిష్యత్తులో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి పరచాలని భావిస్తున్నారు. ఫ్యాకల్టీని ఏర్పాటు చేసి ఉద్యోగార్థులకు ఉచిత తరగతులు నిర్వహించాలనే తలంపుతో ఉన్నారు. సర్కారు కొలువు సాధించడానికి గ్రామీణ విద్యార్థులకు తోడ్పాటు అందివ్వడమే తమ లక్ష్యం అని చెబుతున్న అజయ్, దుర్గాభవాని దంపతులకు మనమూ హ్యాట్సాఫ్ చెబుదాం!



# తగ్గిన భూముల ధరలు...

## కొనేందుకు 'నో' చెబుతున్న రియల్టర్లు..



నిజామాబాద్,: కామారెడ్డి జిల్లాలో 'భూమ్' దందా ఒక్కసారిగా విలవిలా పడింది. ఏడాది క్రితం అత్యధిక ధరలతో అమ్ముడుపోయిన భూముల అమాంతంగా పడిపోవడంతో రియల్ వ్యాపారులు ఆర్థికంగా చతికిలబడ్డారు. మధ్యవర్తితంగా కొనుగోలు చేసిన భూములు అమ్ముడుపోకపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం కోట్ల లోపలికిన భూముల ధర ప్రస్తుతం 40 శాతానికి తగ్గిపోవడంతో అనుకోవాలంటే అసలుకే నష్టం వస్తుందన్న ఆందోళన కలుగుతోంది.వ్యవసాయ భూములే కాకుండా ప్లాట్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టడంతో రియల్ వ్యాపారులు తమ దందాను మూసుకునే పరిస్థితి ఏర్పడింది. మరి కొందరు వ్యాపారులైతే వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జోరుగా సాగిన భూమ్ దందాతో ఆర్థికంగా బాగా స్థిరపడ్డ వ్యాపారులు తాజా పరిస్థితులతో కూడబెట్టుకున్న సొమ్మును వదులు కునే దుస్థితి ఏర్పడింది.టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు భూముల ధరలు అమాంతంగా ఆకాశానంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూముల ధరలపై తీవ్ర ప్రభావం పడింది. ధరలు తగ్గుముఖం పట్టడంతో భూములు ప్లాట్లు అమ్ముకునేవారు ముందుకు రాకపోవడంతో రియల్ వ్యాపారానికి బ్రేక్ పడింది.కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ ఎల్లారెడ్డి పిట్లం బీర్కూర్ మదనూర్ జుక్కల్ ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరం భూమి కోటి రూపాయలకు పైగా ధర పలుకుతుంది. ప్లాట్ల ధరలైతే గజానికి పదివేల నుండి 25 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. రోడ్ సైడ్ ప్లాట్ లకు ధర ఊహించే విధంగా పెంచేస్తున్నారు. పట్టణాలు మండల కేంద్రాలు ది నదినాభివృద్ధి చెందడంతో స్థలం ధరలు కూడా అడ్డగోలుగా పెరుగుతూ వస్తున్నాయి.ఆర్థికంగా పరిపుష్టి ఉంటే తప్ప వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. మరికొన్ని చోట్ల గతంలో ఉన్న ధరలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఒక్కసారిగా భూముల ధరలు పడిపోవడంతో అక్కడి వాసులు జాగల నమ్ముకోవాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాల వైశాల్యం పెరుగుతుం డడం సమీప గ్రామాలను పట్టణంలో చేర్చడంతో జాగా ధర లక్షల నుండి కోట్లలోకి పెరిగి పోయింది. జిల్లాలో ఎల్లారెడ్డి బాన్సువాడ మున్సిపాలిటీగా మారడంతో భూముల ధరలపై ప్రభావం పడింది.ఫలితంగా భూముల అమ్మకాలు కొనుగోలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. పదిమంది కలిసి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేవారు. భూములను ప్లాట్లను కొనుగోలు చేసేటప్పుడు నామమాత్రంగా అడ్వాన్సులు చెల్లించి అట్టి వాటిని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకునేవారు. వచ్చిన లాభాన్ని పదిమంది సమానంగా పంచుకునే పరిస్థితి ఉండేది. దీంతో రియల్ వ్యాపారం కొంతకాలం వరకు దండిగా నడిచింది. భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న కొనుగోలు చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో మిన్నకుండు పోవాల్సి వస్తుంది.రియల్ దందాకు అడ్డు కట్టబడడంతో వ్యాపారాన్ని మానుకొని పరిస్థితి నెలకొందని పలువురు రియల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల కొనుగోలు చేసిన భూములు ప్లాట్లు కూడా అమ్ముడుపోకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు తడిసీమొపై రియల్ వ్యాపారులు ముఖం చాటిసి పరిస్థితి కూడా నెలకొంది. మరికొందరైతే ఈ దందాలో ఇరుక్కుపోయి అరసత్వంగా వచ్చిన భూములు జాగాలను కూడా అమ్ముకొని అప్పులు కట్టే పరిస్థితి కూడా దాపరించింది.రియల్ వ్యాపారం కుదరవడంతో రిజిస్ట్రేషన్లు సైతం తగు ముఖం పట్టాయి. భూముల కొనుగోలు అమ్మకాలు లేకపోవడంతో రియల్ వ్యాపారులతో సందడిగా కనిపించే రిజిస్ట్రేషన్ ఆఫీసులు వేలవేల బోతున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగే రోజుల్లో కార్యాలయాలు కిక్కిరిసి కనిపించేవి. రిజిస్ట్రేషన్‌ల కోసం క్రయవిక్రియ దారులు కార్యాలయాల ముందు పడిగాపులు కాచి స్థితి ఉండేది. ప్రస్తుతం భూము లు ధరల ప్రభావం పడడంతో సామాన్యులు కొనుగోలు చేసేందుకు జంకుతుండడంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు బిజీ తగ్గింది.జరుగుతున్న క్రయవిక్రయాలకు కొన్ని మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇంతకుముందు 50 కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవని, పది రిజిస్ట్రేషన్లు జరగాలంటేనే కష్టంగా ఉన్నట్లు వాపోతున్నారు. డాక్యుమెంటరీ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు తో కలిపి భారీగానే సొమ్ము సమకూరేది. అత్యధికంగా రెవిన్యూ అందించే శాఖ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వానికి, భారీగానే గండి పడుతుంది.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## ఎక్సైజ్ ఎస్సై రాకేష్ కుమార్



కమాన్ పూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంథని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ ఏ రాకేష్ కుమార్ అన్నారు. కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల మరియు గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన విద్యార్థులకు నిర్వహించారు. నేడు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు విద్యార్థులు యువకులు డ్రగ్స్ కు ఆకర్షితులయ్యే అవకాశం ఉందని డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యసనం అనేది మన జీవితాన్ని నాశనం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అటువంటి అలవాటులకు పోకుండా శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ముఖ్యంగా మన ఆరోగ్యాన్ని,మానసికంగా ఎన్నో అనర్థాలు వస్తాయని పేర్కొన్నారు. మద్యానికి దూరంగా ఉండాలని గంజాయి వంటి వాటి జోలికి పోకూడదని పేర్కొన్నారు. గంజాయి అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని దీంతో జెల్ జీవితాలు గడపాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారికి సుమారు 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాలు జైలు శిక్ష రెండు లక్షల రూపాయలు జరిమానా విధించడం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఎస్ ఐ కే పావని మరియు కళాశాల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు



న్యూఢిల్లీ: అమెరికా కరెన్సీ డాలర్ బలపడుతున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. భారత్‌లో కూడా బంగారం ధర చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గింది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నా కూడా రేట్స్‌లో కోత పడింది. దేశంలో ఉదయం సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,120. నిన్నటి ధరతో పోలిస్తే రూ.463 మేర తగ్గింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర కూడా నిన్నటితో పోలిస్తే రూ.650 మేర తగ్గి రూ.1,14,690కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. సోమవారం నాటి ధరతో పోలిస్తే ప్రస్తుతం వెండి రేటు రూ. వెయ్యి మేర తగ్గి రూ.1,62,900కు చేరింది. డాలర్ బలపడటంతో బంగారానికి డిమాండ్ కాస్త తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ సూచీ ప్రస్తుతం 100 మార్కుకు పైనే కదలాడుతోంది. గత ఆరు నెలల్లో ఇదే అత్యధికం. దీంతో ఇన్వెస్టర్లకు కమోడిటీ మార్కెట్‌పై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఈసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం 70 శాతంగా ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్...

హైదరాబాద్,: బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్ పెట్టేందుకు టీజీఎస్‌ఆర్టీసీ కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్లు తెచ్చింది. బస్సు ఆగితేనే డోర్లు తెరుచుకుంటాయి, కదులుతుంటే ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల భద్రత కోసం ఈ వినూత్న మార్పులు చేశారు. ఈ కొత్త బస్సులు ప్రమాదాలను తగ్గించి, ప్రయాణాన్ని సురక్షితంగా మారుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. హైలైట్:ఫుట్‌బోర్డు ప్రయాణాలు, ప్రమాదాలకు చెక్బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలు, కదులుతున్న బస్సుల నుంచి దిగడం వంటి ప్రమాదకర విన్యాసాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న మార్పులు చేపట్టింది. ప్రయాణికుల, ముఖ్యంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో అత్యాధునిక హైడ్రాలిక్ ఆటోమెటిక్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. స్టేజీ వద్ద బస్సు పూర్తిగా ఆగినప్పుడు మాత్రమే ఈ డోర్లు తెరుచుకుంటాయి. బస్సు కదులుతున్నప్పుడు లేదా వేగంగా ఉన్నప్పుడు ఇవి ఆటోమెటిక్‌గా మూసుకుని లాక్ అవుతాయి. దీనివల్ల



ప్రయాణికులు పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కడం, కదులుతున్న బస్సు నుంచి దిగిపోవడం లేదా ఫుట్‌బోర్డుపై వేలాడటం కుదరదు. ఈ వ్యవస్థ విమానాశ్రయ బస్సులు (ఏసీ ఇంద్ర), హైఎండ్ డీలక్స్ బస్సుల్లో ఉండే సాంకేతికత తరహాలో పనిచేస్తుంది.

యినగరంలో జరిగిన ప్రమాదాలపై ఆర్టీసీ అధికారులు లోతుగా అధ్యయనం చేశారు. ఎక్కువ ప్రమాదాలు ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్లే జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న మార్గాలపై దృష్టి సారించారు.

# అరకు కాఫీకి సర్కారీ ప్రమోషన్



విశాఖపట్టణం, : ఏపీ ప్రభుత్వం కాఫీ రైతులకు శుభవార్త వినిపించింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ రైతులకు తీపికబురు వినిపించింది. అల్లూరి జిల్లాలోని గూడెం కొత్తవీధి, జి. మాడుగుల మండలాల్లో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ.7 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. గూడెం కొత్తవీధిలో మెషీన్ల సాయంతో భూమిని చదును చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాఫీ రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగుల, గూడెం కొత్త వీధి మండలాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎప్పుడో ప్రణాళికలు రచించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ రెండుచోట్లా ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7 కోట్లు నిధులు విడుదల చేయడంతో పల్పింగ్ కేంద్రాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.మరోవైపు ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు కూడా ఉపయోగిస్తున్నారు. 80 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావటంతో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. గూడెం కొత్తవీధిలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రం వద్ద భూమిని చదును చేసే ప్రక్రియ ప్రారంభించారు. యంత్రాల సాయంతో భూమిని చదును చేస్తున్నారు. గూడెం కొత్తవీధిలో పల్పింగ్ కేంద్రం రక్షణ గోడ కోసం రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నారు.మరోవైపు మన్యం ప్రాంతంలో కాఫీ తోటల సాగు ఎక్కువ. మన్యంలో సుమారుగా రెండున్నర లక్షల ఎకరాలలో కాఫీ పంట సాగవుతోంది. కాఫీ తోటలపై ఆధారపడి లక్షకుపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడి నుంచి సుమారుగా రూ.200 కోట్ల వరకూ కాఫీ వ్యాపారం జరుగుతోంది.మరోవైపు అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సంపాందించుకున్న విషయం తెలిసిందే.ప్రభుత్వం కూడా అరకు కాఫీని ఇదే రీతిలో ప్రమోట్ చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు నిధులు విడుదల చేశారు. దీంతో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్దేశిత గడువులోగా ఈ పనులు పూర్తిచేస్తామని అధికారులు చెప్పున్నారు.

# అంబటి వ్యాఖ్యలపై చర్చ...



గుంటూరు : వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల నడిరోడ్డుపై మీడియా ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. సభ్యసమాజం ఆమోదించలేని పదజాలంతో చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. అధికారంలో ఉన్న సమయంలో ఇదే తరహా వ్యాఖ్యలు టీడీపీ నేతల నుంచి వచ్చి ఉంటే ఎలా స్పందించేవారు అన్న అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి జగన్ మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అర్ధరాత్రి అరెస్ట్ జరిగిన ఉదంతాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఆ సందర్భాన్ని ఇప్పుడు అంబటి వ్యవహారంతో పోలుస్తూ, చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అంబటి వ్యాఖ్యలను సమర్థించే పరిస్థితి వైసీపీలోనే కనిపించడం లేదు. పార్టీ అధినేత తప్ప ఇతర నాయకులు బహిరంగంగా మద్దతు పలకకపోవడం గమనార్హం.వైసీపీలోని పలువురు నేతలు ఆఫ్ ది రికార్డ్‌గా మాట్లాడుతూ, అంబటి మాట తీరు ఎప్పటి నుంచో ఇలాగే ఉందని, గతంలో కూడా అనేకసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కొందరు నేతలు ఆయన ప్రవర్తన పార్టీకి నష్టం కలిగిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంబటి వ్యవహారం వ్యక్తిగత అంశం కాదని, పార్టీ అంతర్గత సమస్యల ప్రతిబింబంగా మారిందనే అభిప్రాయం వినిపిస్తోంది.అసలు అంబటి ఈ స్థాయిలో స్పందించడానికి కారణాలేంటి అన్నది మరో కీలక అంశంగా మారింది. బహిరంగంగా చెబుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆయన కారును అడ్డుకోవడమే కారణం కాదని, వైసీపీలోని కొందరు నాయకులే అంటున్నారు. ఇటీవల సత్తెనపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పదవి నుంచి అంబటిని తప్పించడంతో ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గిందనే భావన పెరిగిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయనపై కేసులు నమోదవడం, పార్టీ నుంచి సరైన సహకారం లేకపోవడం కూడా అసంతృప్తికి కారణమైందని అంటున్నారు.ఈ అన్ని అంశాల సమ్మేళనమే అంబటి కోపంగా బయటపడడానికి దారితీసిందని రాజకీయ వర్గాల విశ్లేషణ. ఈ ఘటనతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని, వైసీపీలో అంతర్గత అసంతృప్తి బయటకు వస్తోందనే చర్చ జరుగుతోంది. ఒక్క అంబటే కాకుండా మరికొందరు నాయకులు కూడా ఇదే తరహా ఆగ్రహంతో ఉన్నప్పటికీ, కొందరు సంయమనం పాటిస్తుండగా మరికొందరు బహిరంగంగా స్పందిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా ఈ పరిణామాలు వైసీపీ భవిష్యత్ రాజకీయ దిశపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

# మళ్లీ పడిపోయిన టమాటా ధరలు

తిరుపతి, : ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి టమాటా ధరలు భారీగా పడిపోయాయి. పంటను మార్కెట్‌లకు తీసుకొచ్చిన రైతులు ధరలు పతనం కావడంతో ఆందోళనలో ఉన్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు టమాటా కోతను వాయిదా వేశారు. రాష్ట్రంలోని మార్కెట్‌లలో మరీ దారుణంగా కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉందని చెబుతున్నారు రైతులు.చాయ్ కంటే చీప్.. కేజీ రూ.10లోపే.. ఇది ఏపీలో టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి. గతేడాది కొన్ని నెలల పాటూ సిరులకు కురిపించి టమాటా ధరలు.. ఇప్పుడు మాత్రం దారుణంగా పడిపోయాయి. మార్కెట్‌లలో కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉంది. ఈ ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటా కోత, రవాణా చేసినందుకు అయ్యే ఖర్చు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను మార్కెట్‌కు తరలించినా ఉపయోగం లేకుండా పోతోంది అంటున్నారు. ఒక్కసారిగా ధరల పడిపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అయితే జనాలు మాత్రం టమాటా ధరలు తగ్గిపోవడంతో పండగ చేసుకుంటున్నారు.జనవరి మొదటి వారంలో టమాటాలు కేజీ రూ.10 నుంచి రూ.20 మధ్య పలికాయి. ఇప్పుడేమో దారుణంగా కేజీ రూ.5 నుంచి రూ.10 మధ్య పలుకుతున్నాయి. అయితే వ్యాపారులు రిటైల్‌గా కేజీ రూ.15 నుంచి రూ.20కు టమాటాను విక్రయిస్తున్నారు. కానీ దారుణంగా రైతుల నుంచి మాత్రం తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట నాణ్యత సరిగా లేకపోవడంతోనే ధరలు తగ్గాయంటున్నారు



వ్యాపారులు. మార్కెట్‌కు వస్తున్న సరుకు మొదట్లో వచ్చినంత నాణ్యత లేదని.. అందుకే తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు.రైతులు మాత్రం వ్యాపారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో మార్కెట్లకు వచ్చే టమాటా పంట కూడా తగ్గింది అంటున్నారు. టమాటా ధరలు దారుణంగా పడిపోవడంతో చాలామంది రైతులు కాయల్ని కోసే సాహసం చేయడం లేదు. ఇటీవల టమాటా సాగు చేసిన రైతులది కూడా ఇదే పరిస్థితి. టమాటా సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని.. ఇప్పుడు ధరలు తగ్గడంతో కనీసం ఖర్చులకు కూడా డబ్బులు రావడం లేదంటున్నారు. చాలామంది రైతులు అప్పులబారిన పడుతున్నారట. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధరల దక్కేలా న్యాయం చేయాలని కోరుతున్నారు. కొందరు రైతులు మాత్రం ధరలను చూసి పొరుగు జిల్లాల్లో మార్కెట్‌లకు తరలిస్తున్నారట. అక్కడైనా సరైన దొరకుతుందనే ఆశతో ఇలా చేస్తున్నారట. మొత్తానికి టమాటా ధరలు తగ్గడంతో రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉన్నారు.

# ఎంపీల పనితీరుపై సమగ్ర నివేదికలు

గుంటూరు : తెలుగుదేశం పార్టీలో సంస్థాగత క్రమశిక్షణను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగిస్తూ వారి పనితీరును సమీక్షించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు , జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పుడు అదే విధానాన్ని ఎంపీలకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. ప్రజలతో నేరుగా అను సంధానం పెంచడం, సమస్యల పరిష్కారంలో వేగం తీసుకురావడం ఈ చర్యల వెనుక ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎదురైన సమస్యలు, గత 15 నెలల కాలంలో పరిష్కరించిన అంశాల పై ఎంపీలు సమగ్ర నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని పార్టీ ఆదేశించిం ది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కారమయ్యాయి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి ఏవి అనే వివరాలను స్పష్టంగా పొందుపర చాలని సూచించింది. దీనితో పాటు పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ లు ప్రస్తావించిన అంశాలు, వాటికి కేటాయించిన సమయం, ఆ చర్చల వల్ల నియోజకవర్గానికి వచ్చిన ప్రయోజనాలు వంటి విషయా లనూ వివరించాలని కోరుతోంది.ఇకపై ఎమ్మెల్యేలతో నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల మాదిరిగానే ఎంపీలతో కూడా నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశా ల్లో ప్రజలతో నాయకులు ఎలా మమేకమవుతున్నారు, క్షేత్రస్థాయిలో వారి పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉంది అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న చొరవ, ప్రజల మధ్య గడుపుతున్న సమయం, పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి విషయాలు ఈ సమీక్షలో కీలకంగా మారనున్నాయి.వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల మూడ్ ఎలా మారుతోంది అనే అంశాన్ని కూడా పార్టీ గమనిస్తోంది. అందుకు తగ్గట్టుగా నాయకుల పనితీరును మలచాలనే ఆలోచనతో ఈ సమీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన బాధ్యతలు, సమన్వయం ఉండాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు. నారా లోకేష్ నేతృత్వంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు రూపొందుతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీలతో ప్రత్యక్ష సమావేశాల ద్వారా వారు ఎదుర్కొంటున్న సంస్థాగత సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధానంతో నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని, నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు. ఎంపీలను కూడా క్రమశిక్షణతో పనిచేసేలా "లైన్‌లో" పెట్టాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవుతుందని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

## సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డు అందుకున్న కృష్ణవేణి విద్యార్థిని సాయి స్కంద

మంథని ప్రతినిధి: సుచిన్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన సర్ సివి రామన్ యంగ్ జీనియస్ మ్యాథ్స్ ఒలంపియడ్ పరీక్షలో స్టేట్ 5వ ర్యాంకు సాధించిన మంథని కృష్ణవేణి హై స్కూల్ 5వ తరగతి విద్యార్థి కే.సాయి స్కంద అవార్డు అందుకుంది. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ఘంటా శ్రీనివాసరావు, చింతమనేని ప్రభాకర్ రావు,సినీ ప్రముఖులు హీరో శ్రీకాంత్,శివాజీ రాజా, సుచీర్ ఇండియా గ్రూప్ వ్యవస్థాపకులు డాక్టర్ వై కిరణ్‌లు కే.సాయి స్కంద కు అవార్డు, సర్టిఫికెట్ అందజేశారు. అవార్డు పొందిన విద్యార్థిని సాయి స్కంద ను పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్,



డైరెక్టర్లు పి. సుదర్శన్ రెడ్డి, జాఫర్ హుస్సేన్,నరేష్,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

# గేమ్ ఛేంజర్ కాబోతున్న ఎర్త్ కారిడార్

నెల్లూరు: కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో ఏపీకి గుడ్ న్యూస్ వినిపించింది. ఏపీతో పాటుగా మరో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రేర్ ఎర్త్ కారిడార్ ప్రాజెక్టు ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఏపీలోని కోస్టల్ కారిడార్ వెంట ఉన్న ఖనిజాలు, తీర ప్రాంతం, పోర్టులతో అనుసంధానం.. ఏపీని అరుదైన ఖనిజాల అన్వేషణకు గమ్యస్థానంగా మార్చుతుందంటున్నారు. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నాలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఉంది. దీంతో ఏపీ పాలిట గేమ్ ఛేంజర్‌గా రేర్ ఎర్త్ కారిడార్ మారుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరుదైన భూలోహాలు, ఖనిజాల అన్వేషణకు హబ్‌గా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రభుత్వం నుంచి విధానపరంగా, ఆర్థికంగా సహకారం లభించే అవకాశాలు ఉండటంతో ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కోస్టల్ కారిడార్ వెంట ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఖనిజాల అన్వేషణ కోసం చర్యలు మొదలుపెట్టింది. ఇందుకోసం 16 వేల హెక్టార్ల భూమిని కూడా కేటాయించారు. కోస్టల్ కారిడార్ ప్రాంతంలో మోనజైట్, ఇల్మనైట్, రూటైల్, జిర్కాన్, గార్నెట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అరుదైన రేర్ ఎర్త్ ఆక్సైడ్లు (55?60 శాతం) థోరియం (8-10 శాతం) అధిక సాంద్రతలో ఉన్నాయంటున్నారు. ఇవి అడ్వాన్స్ టెక్నాలజీకి సంబంధించిన అత్యంత కీలకమైన ముడి పదార్థాలుగా చెప్తున్నారు.మరోవైపు ఖనిజాల అన్వేషణకు సంబంధించి ఇప్పటికే ఓ ప్రైవేట్ సంస్థకు టెండర్లు కూడా కేటాయించారు. వేయి హెక్టార్ల వరకూ అనుమతి మంజూరు చేశారు. దీనికి అదనంగా మరో నాలుగు వేల హెక్టార్లలో ఖనిజాల అన్వేషణకు కేంద్రం అనుమతి కోరుతున్నట్లు రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. అనుమతులు పొందిన తర్వాత మిగిలిన 11వేల హెక్టార్లలో కార్యకలాపాలను దశలవారీగా వేగవంతం చేస్తామన్నారు.

మరోవైపు ఖనిజాల తవ్వకం, ఎగుమతులు మాత్రమే కాకుండా వాటికి అదనపు విలువను జోడించడం ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతం, పోర్టులతో అనుసంధానం, విస్తరిస్తున్న పారిశ్రామిక కారిడార్లు కూడా రేర్ ఎర్త్ కారిడార్‌కు కలిసివస్తాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిన ఈ రేర్ ఎర్త్ కారిడార్ ఏపీకి గేమ్ ఛేంజర్‌గా అవకాశం ఉందని చెప్తున్నారు.

# దాడుల- ప్రతి దాడుల సంస్కృతా..


విజయవాడ,: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొన్నేళ్లుగా సాగుతున్న "దాడులు-ప్రతిదాడుల" సంస్కృతిలో ఒక కీలక మార్పు కనిపిస్తోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత జోగి రమేశ్ నివాసంపై జరిగిన దాడి ఉదంతం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ఈ ఘటనలో చర్చనీయాంశం దాడి మాత్రమే కాదు.. ఆ దాడి జరిగిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం స్పందించిన తీరు, తీసుకున్న నిర్ణయాలు విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.టీడీపీ యువనేత, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేశ్ గతంలో చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలోనే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు టీడీపీ కార్యకర్తలు, నేతలు జోగి రమేశ్ ఇంటిపై దాడికి దిగారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, రాళ్లు రువ్వడం, పెట్రోల్ బాటిళ్లు విసిరి మంటలు రాజేయడం వంటి తీవ్రస్థాయి చర్యలకు పాల్పడ్డారు. ఇది శాంతిభద్రతల పరంగా పెద్ద చర్చకు దారితీసింది.సాధారణంగా అధికార పార్టీ కార్యకర్తలు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసినప్పుడు, ప్రభుత్వం వారిని వెనకేసుకొస్తుందనే ముద్ర భారత రాజకీయాల్లో బలంగా ఉంది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో భిన్నమైన వైఖరిని ప్రదర్శించారు. ఈ దాడి ఘటనను ఆయన తీవ్రంగా పరిగణించడమే కాకుండా, "చట్టం ఎవరికైనా ఒక్కటే.. తప్పు చేసిన వారు మన పార్టీ వారైనా సరే కేసులు నమోదు చేయాల్సిందే" అని పోలీసులను ఆదేశించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. వీరిలో 11 మంది కీలక నేతలను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిబంధనల ప్రకారం వారికి స్టేషన్ బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారు, కానీ చట్టపరమైన ప్రక్రియను మాత్రం ప్రభుత్వం అడ్డుకోలేదు.ఈ ఘటనను విశ్లేషిస్తున్న వారు సహజంగానే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరితో పోల్చుతున్నారు. టీడీపీ నేతలు ప్రధానంగా రెండు అంశాలను ఇక్కడ గుర్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసినప్పుడు, బాధ్యులపై చర్యలు తీసుకోవడం మాట అటుంచి, తిరుగుబాటు చేసిన టీడీపీ నేతలపైనే రివర్స్ కేసులు నమోదయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించిన వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా వైఎస్సార్సీపీ "అరెస్టుల కంటే అభినందనలకే" ప్రాధాన్యత ఇచ్చిందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. దీనికి భిన్నంగా, ఇటీవల వై.ఎస్. భారతిని అసభ్య పదజాలంతో దూషించిన ఐటీడీపీ కార్యకర్తపై చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని, జైలుకు పంపించడం ద్వారా "తప్పు ఎవరి వైపు ఉన్నా క్షమించేది లేదని" సంకేతాలు పంపినట్లయింది.ఒక ప్రభుత్వం తన సొంత కార్యకర్తలపై కేసులు పెట్టడం అనేది రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయమే. దీనివల్ల క్యాడర్‌లో కొంత అసంతృప్తి కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. "రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ అవి భౌతిక దాడుల వరకు వెళ్లినప్పుడు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే సమాజంలో అరాచకం పెరుగుతుంది. చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తుంది." అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జోగి రమేశ్ ఇంటిపై దాడి ఘటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక పాఠంగా నిలిచిపోనుంది. అధికారంలో ఉన్నాం కదా అని చట్టాన్ని అతిక్రమిస్తే, సొంత ప్రభుత్వం కూడా వెనకేసుకురాదని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. గత ప్రభుత్వ తీరుకు, ప్రస్తుత ప్రభుత్వ జవాబుదారీతనానికి మధ్య ఉన్న ఈ వ్యత్యాసమే తమను ప్రజల్లో మెరుగ్గా నిలబెడుతుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం ఎన్నికల హామీలే కాకుండా, పరిపాలనలో, శాంతిభద్రతల నిర్వహణలో ఇటువంటి కఠిన నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుకు శుభసూచకం

# లగోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు...




దేశీయ గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు పోగవుతున్నాయి. గత కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు పెరుగుతుండటంతో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు వరదలా వచ్చి చేరుతున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జనవరి నెలకు సంబంధించి గోల్డ్ ఈటీఎఫ్ విభాగంలో ఏకంగా రూ. 24,039.96 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది గతేడాది జనవరిలో వచ్చిన రూ. 11,647 కోట్ల కంటే రెట్టింపు కావడం విశేషం.అంతేకాకుండా ఇదే నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చిన రూ. 24,028 కోట్ల కంటే కూడా కూడా ఎక్కువ గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి నిధులు రాడం విశేషం. ఇక, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులకు సంబంధించి జనవరి నెలలో నిధులు 14 శాతం తగ్గి రూ. 24,028 కోట్లు వచ్చాయి. ఇవి వరుసగా రెండో నెలా తగ్గుముఖం పట్టాయి. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న స్తబ్దత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో మదుపు చేసేందుకు జాగ్రత్త పడ్డారు. ఇదే సమయంలో బంగారం ధరలు పుంజుకోవడం వల్లనే గోల్డ్ ఈటీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు మొగ్గు చూపారు. దీంతో మ్యూచువల్ ఫండ్ సంస్థల(ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ. 81.01 లక్షల కోట్లకు చేరింది.

## ఇరాన్ నుంచి దిగుమతుల సమాచారాన్ని కోరిన అమెరికా




ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకున్న ఆరోపణలపై, కంపెనీ నుంచి అమెరికా ఏజెన్సీ సమాచారాన్ని కోరినట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న సంస్థలతో లావాదేవీలపై దర్యాప్తులో భాగంగా, ఈనెల 4న అమెరికా ఆర్థిక శాఖకు చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఈ సమాచారాన్ని కోరినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది.

2025 జూన్‌లో వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికకు సంబంధించిన చర్చల తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు ఉన్న నౌకా మార్గాల్లో ఇరాన్ నుంచి ఎల్‌పీజీను అదానీ గ్రూప్ కంపెనీలు దిగుమతి చేసుకున్నాయని నివేదిక ఆరోపించింది.

## వెనెజువెలా చమురుతో భారత్‌కు 3 బిలియన్ డాలర్ల ఆదా




అమెరికాతో ట్రేడ్ డీల్‌పై అంగీకారానికి వచ్చిన భారత్.. వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లకు సిద్ధమైంది. ఈ నిర్ణయంతో మన దేశానికి ఏటా దాదాపు 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.27వేల కోట్లు) ఆదా కానుందట. ఈ మేరకు ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. భారత్ చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే దిగుమతుల వ్యయం భారీగా తగ్గుతుందని ఈ నివేదిక పేర్కొంది. “వెనెజువెలా చమురు బ్యారెల్‌పై 10-12 డాలర్ల వరకు డిస్కౌంట్ లభిస్తే.. ఆ చమురును ఎంచుకోవడం భారత్‌కు లాభదాయకమే. రవాణా వ్యయం, ఇతర ఖర్చులన్నీ తీసేసినా ఏటా మన దేశానికి చమురు దిగుమతుల బిల్లు 3 బిలియన్ డాలర్ల మేర తగ్గుతుంది. ప్రస్తుతం చమురు ధరల డేటా ప్రకారం.. వెనెజువెలా ముడిచమురు బ్యారెల్ ధర దాదాపు 51 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది” అని ఎస్‌బీఐ రీసెర్చ్ తమ నివేదికలో తెలిపింది. భారత్ తమ ముడి చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే.. ఖర్చు విషయంలో అనేక అంశాలను పరిగణించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ ఎంత వస్తుంది.. రవాణా ఖర్చులు, సమయం, బీమా వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని మన వ్యయాలను లెక్కలేసుకోవాలి. భౌగోళికపరంగా వెనెజువెలా మనకు చాలా దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి చమురు రవాణాకు పట్టే సమయం.. పశ్చిమాసియా దేశాలతో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ. ఇక, రష్యా నుంచి వచ్చే సమయం కంటే రెట్టింపు. దీంతో వెనెజువెలా చమురుకు రవాణా వ్యయం అదనపు భారం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

అయితే, రష్యా నుంచి డిస్కౌంట్ ధరకు చమురు సుదీర్ఘకాలం లభించే అవకాశం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధ పరిస్థితులు తగ్గుముఖం పడితే డిస్కౌంట్ ఆగిపోవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వేళ వెనెజువెలా చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గుచూపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# రూ.1,000 కోట్లతో ఐఐఎల్ విస్తరణ



హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) తన పరిశోధన, ఉత్పత్తి కార్యకలాపాలను విస్తరించనుంది. దీంతో పాటు కొత్త మార్కెట్లలో అడుగుపెట్టే ప్రయత్నాలు చేస్తోంది. దక్షిణ అమెరికా దేశాలకు టీకాలు, ఔషధ ఉత్పత్తులు అందించేందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్లు ఐఐఎల్ ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్ మంగళవారం ఇక్కడ ఈనాడుకు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. మూడేళ్లలో ఈ దశను అధిగమించి, దక్షిణ అమెరికా దేశాల్లో అడుగుపెట్టాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) మంజూరు చేసిన నిధులతో 2 కొత్త టీకాలు అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో ఒకటి డెంగీ టీకా కాగా, మరొకటి కేఎఫ్‌డీ వైరస్ టీకా. డెంగీ టీకాపై మొదటి దశ క్లినికల్ పరీక్షలు పూర్తి చేశామని, రెండో దశ పరీక్షలు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

కేఎఫ్‌డీ వైరస్ కర్ణాటకలోని అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండే ప్రజలకు ప్రాణాంతకంగా మారుతోందని, దీని వల్ల టిక్ బార్న్ హెమరేజిక్ ఫీవర్ వస్తుందని అన్నారు. దీన్ని అదుపు చేసే లక్ష్యంతో కేఎఫ్‌డీ టీకా ఆవిష్కరించే యత్నాల్లో ఉన్నామని.. దీనిపై మొదటి దశ క్లినికల్ పరీక్షలు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

## వాహనాల రిటైల్ అమ్మకాలకు జీఎస్టీ బూస్ట్




దేశీయ వాహన పరిశ్రమలో కంపెనీలు సరికొత్త రికార్డు అమ్మకాలను సాధించాయి. ఈ ఏడాది జనవరిలో దేశీయ ఆటో పరిశ్రమ రిటైల్ అమ్మకాలు దాదాపు 18 శాతం పెరిగి 27 లక్షల యూనిట్లకు చేరాయని డీలర్ల సంఘం ఫాడా మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. గతేడాది పండుగ సీజన్‌కు ముందు కేంద్రం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలకు దోహదపడ్డాయి. గత నెలలో పంటకోత, వివాహ వేడుకల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో గిరాకీ సానుకూలంగా ఉండటం వంటి అంశాలు కూడా అమ్మకాలు పెరిగేందుకు ప్రధాన కారణాలు. ఫాడా డేటా ప్రకారం, జనవరిలో మొత్తం రిటైల్ అమ్మకాలు 27,22,558 యూనిట్లకు చేరాయి.

గతేడాది ఇదే నెలలో 23,14,940 యూనిట్లతో పోలిస్తే ఇది 17.61 శాతం పెరిగింది. ఇందులో ప్యాసింజర్ వాహనాల రిటైల్ అమ్మకాలు 7 శాతం పెరిగి 5,13,475 యూనిట్లుగా నమోదయ్యాయి. మెట్రో ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు 14.43 శాతం పెరిగాయి.

పట్టణ ప్రాంతాల్లో మాత్రం 2.75 శాతం వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఎస్‌యూవీ, కాంపాక్ట్ ఎస్‌యూవీ, ఎంట్రీ-లెవల్ కార్లకు తిరిగి డిమాండ్ కనిపిస్తోందని ఫాడా అధ్యక్షుడు సీ ఎస్ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. ద్విచక్ర వాహన విభాగంలో 18,52,870 యూనిట్లు, త్రీ-వీలర్ విభాగంలో 19 శాతం, కమర్షియల్ విభాగంలో 15 శాతం అమ్మకాలు పెరిగాయి. ట్రాక్టర్ అమ్మకాలు అధికంగా 23 శాతం పెరిగాయని ఫాడా వెల్లడించింది.

## తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరిగాయి...!



తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి.హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమోడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

## భారత్‌లో 35 బిలియన్ డాలర్ల పెట్టుబడులు




2030 నాటికి భారత్‌లో వివిధ వ్యాపారాల్లో 35 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెడతామని ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ వెల్లడించింది. ఉపాధి కల్పన, వ్యాపార విస్తరణ కోసం ఈ ప్రణాళికలను ప్రకటించింది. దిల్లీలో జరిగిన అమెజాన్ సంభవ్ సమిట్‌లో ఈ ప్రకటన చేసింది. గత 15 ఏళ్లలో భారత్‌లో అమెజాన్ 40 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది. భారతదేశ విస్తృత డిజిటల్, ఆర్థిక ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతి వృద్ధి, ఉద్యోగ సృష్టి లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని వెల్లడించింది. అమెజాన్ ఇప్పటివరకు 12 లక్షల వ్యాపారాలను డిజిటలైజ్ చేసిందని, 2024లో సుమారు 2.8 మిలియన్ల మందికి ప్రత్యక్ష, పరోక్ష, సీజనల్ ఉద్యోగాలు లభించాయని పేర్కొంది. 2030 నాటికి అదనంగా 10 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పెట్టుకుంది. “గత 15 ఏళ్లుగా భారత్ డిజిటల్ ప్రయాణంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. మా సంస్థ వృద్ధి.. భారత ప్రభుత్వ ఆత్మనిర్భర్, వికసిత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. భారత్‌లో చిన్న వ్యాపారాలకు డిజిటల్ మౌలిక సదుపాయాలను అందించడంలో, లక్షలాది ఉద్యోగాలను సృష్టించడంలో, మేడ్ ఇన్ ఇండియాను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లే దిశగా మేం భారీగా పెట్టుబడులు పెట్టాం” అని అమెజాన్‌లో ఎమర్జింగ్ మార్కెట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ అన్నారు. కొత్త పెట్టుబడుల గురించి ప్రకటన చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

## వచ్చే ఏడాది మొదటి ఏఐ గ్లాసెస్‌ను విడుదల చేయనున్న గూగుల్

గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ వచ్చే ఏడాదిలో తన మొదటి ఏఐ-ఆధారిత స్మార్ట్ గ్లాసెస్‌ను విడుదల చేయనున్నట్టు వెల్లడించింది. కంపెనీ ప్రధానంగా శాంసంగ్, జెంటిల్ మాన్‌స్టర్‌లతో కలిసి, వార్బీ పార్కర్ల భాగస్వామ్యంతో రెండు రకాల గ్లాసెస్‌ను అభివృద్ధి చేస్తోంది. జెమిని ఏఐ అసిస్టెంట్‌ని ఉపయోగించి స్క్రీన్-ఫ్రీ ద్వారా ఆడియో-ఓన్లీ ఏఐ గ్లాసెస్‌తో పాటు నావిగేషన్, ట్రాన్స్‌లేషన్, ఇతర ప్రైవేట్ సమాచారాన్ని చూపించే ఇన్-లెన్స్ స్క్రీన్‌తో డిస్ప్లే-ఎనేబుల్డ్ ఏఐ గ్లాసెస్ తీసుకొచ్చేందుకు గూగుల్ పనిచేస్తోంది. ఇదివరకు గూగుల్ 2012లో స్మార్ట్‌గ్లాసెస్ అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించింది. కానీ, ఏఐ టెక్నాలజీ, ఇతర హార్డ్‌వేర్ సామర్థ్యం పరిమితంగా ఉండటంతో ఆ ప్రయత్నాలను వదిలిపెట్టింది. అయితే, ఇప్పుడు ఏఐ టెక్నాలజీ మెరుగ్గా ఉండటంతో ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్‌పై కొత్త స్మార్ట్ గ్లాసెస్‌ను రూపొందిస్తోంది. అది గతం కంటే మరింత ఆచరణాత్మక, ఏఐ ఫీచర్స్‌తో తీసుకురానున్నట్టు గూగుల్ తెలిపింది. మరోవైపు, గూగుల్‌కు మెటా-రేబాన్‌కు చెందిన స్మార్ట్ గ్లాసెస్, స్నాప్, ఆలీబాబా, యాపిల్‌ల నుంచి పెరుగుతున్న పోటీ నేపథ్యంలో మరింత సమర్థవంతంగా ఏఆర్, ఏఐ ఉత్పత్తులపై కృషి చేస్తోంది. గూగుల్ ఇప్పటికే రూపొందించిన ప్రోటోటైప్‌లలో గూగుల్ మ్యాప్స్, గూగుల్ మీట్ లాంటి యాప్‌ల కోసం ఏఆర్ ఓవర్‌లేతో ఉన్న మోనోక్యులర్, బైనాక్యులర్ డిస్‌ప్లేలను కలిగి ఉంది. కానీ, ఏఐ టెక్నాలజీ, ఇతర హార్డ్‌వేర్ సామర్థ్యం పరిమితంగా ఉండటంతో ఆ ప్రయత్నాలను వదిలిపెట్టింది.

## వచ్చే ఏడాది మొదటి ఏఐ గ్లాసెస్‌ను విడుదల చేయనున్న గూగుల్

గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ వచ్చే ఏడాదిలో తన మొదటి ఏఐ-ఆధారిత స్మార్ట్ గ్లాసెస్‌ను విడుదల చేయనున్నట్టు వెల్లడించింది. కంపెనీ ప్రధానంగా శాంసంగ్, జెంటిల్ మాన్‌స్టర్‌లతో కలిసి, వార్బీ పార్కర్ల భాగస్వామ్యంతో రెండు రకాల గ్లాసెస్‌ను అభివృద్ధి చేస్తోంది. జెమిని ఏఐ అసిస్టెంట్‌ని ఉపయోగించి స్క్రీన్-ఫ్రీ ద్వారా ఆడియో-ఓన్లీ ఏఐ గ్లాసెస్‌తో పాటు నావిగేషన్, ట్రాన్స్‌లేషన్, ఇతర ప్రైవేట్ సమాచారాన్ని చూపించే ఇన్-లెన్స్ స్క్రీన్‌తో డిస్ప్లే-ఎనేబుల్డ్ ఏఐ గ్లాసెస్ తీసుకొచ్చేందుకు గూగుల్ పనిచేస్తోంది. ఇదివరకు గూగుల్ 2012లో స్మార్ట్‌గ్లాసెస్ అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించింది. కానీ, ఏఐ టెక్నాలజీ, ఇతర హార్డ్‌వేర్ సామర్థ్యం పరిమితంగా ఉండటంతో ఆ ప్రయత్నాలను వదిలిపెట్టింది. అయితే, ఇప్పుడు ఏఐ టెక్నాలజీ మెరుగ్గా ఉండటంతో ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్‌పై కొత్త స్మార్ట్ గ్లాసెస్‌ను రూపొందిస్తోంది. అది గతం కంటే మరింత ఆచరణాత్మక, ఏఐ ఫీచర్స్‌తో తీసుకురానున్నట్టు గూగుల్ తెలిపింది. మరోవైపు, గూగుల్‌కు మెటా-రేబాన్‌కు చెందిన స్మార్ట్ గ్లాసెస్, స్నాప్, ఆలీబాబా, యాపిల్‌ల నుంచి పెరుగుతున్న పోటీ నేపథ్యంలో మరింత సమర్థవంతంగా ఏఆర్, ఏఐ ఉత్పత్తులపై కృషి చేస్తోంది.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com